Follow: @ANNTELUGU

28-07-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 205 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు


- సీఎం చంద్రబాబు
- ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం.
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

**అమరావతి, మహా :** ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కీలక మైలురాయిగా నిలవబోతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కలను సాకారం చేయడమే కాకుండా, ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం అమరావతిలో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, రూ.4,727 కోట్ల వ్యయంతో 2,703 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రతిష్ఠాత్మక విమానాశ్రయాన్ని నిర్మించినట్లు తెలిపారు. 3,800 మీటర్ల పొడవైన రన్‌వేతో అత్యాధునిక సదుపాయాలు కలిగిన మిగితా 2వ పేజీలో

టాప్ న్యూస్

## తెలంగాణలో ఫ్యామిలీ రిజిస్టర్

ఒక్క రికార్డు.. అనేక సేవలు



02

## నేను స్ట్రీట్ ఫైటర్‌ను

- మాజీ మంత్రి
- రాజీనామా తర్వాత పార్లమెంటుకు వచ్చిన ప్రధాన్



02

## జగన్ తో బహిరంగ చర్చకు రెడీ

- డీఎస్సీపై లోకేష్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా



02



## పెద్దిని కాపాడండి

- ఏం చేస్తారో తెలియదు
- యశోదలో వైద్యులతో కేసీఆర్

02

# రంగనాథ్ ను తప్పించండి




## హైడ్రాచీఫ్ పై హైకోర్టు ఆగ్రహ ఆదేశం

- హైడ్రా కమిషనర్ గా మరో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని ఆదేశం
- ఒక్క అధికారిపై 63 కోర్టు ధిక్కరణలా?
- కోర్టుకు క్షమాపణచెబుతూ రంగనాథ్ అఫిడవిట్
- రంగనాథ్ ను కొనసాగించాలా? తప్పించాలా అన్న అంశంపై ప్రభుత్వం చర్చలు

**హైదరాబాద్, మహా :** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వైఖరిపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. మల్కాజ్‌గిరి మండలం లోతుకుంటలోని వివాదాస్పద భూముల్లో కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేతలకు పాల్పడ్డారన్న పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, చట్టాన్ని, కోర్టు ఆదేశాలను పదేపదే ధిక్కరించడంపై మండిపడింది. ఈ క్రమంలో మిగతా 2వ పేజీలో

## రాజ్యాంగ స్ఫూర్తితోనే పనిచేశా

02



హైకోర్టు తీర్పుపై 'హైడ్రా' చీఫ్ రంగనాథ్

## ఒప్పందం ఉల్లంఘించిన కేంద్రం

- మళ్ళీ ఆందోళనలు తప్పవు
- కేంద్రానికి కాక్రోచ్ జనతాపార్టీ వార్నింగ్
- వందలాది విద్యార్థుల అరెస్ట్ లు జరుగుతున్నాయని ఆగ్రహం




**హైదరాబాద్, మహా :** నీట్ ఆందోళనల సందర్భంగా కేంద్ర ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాన్ని ఉల్లంఘించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వానికి మరోసారి వార్నింగ్ ఇచ్చింది. విద్యార్థులపై నమోదైన కేసుల్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మళ్లీ దేశవ్యాప్తంగా నిరసనలకు దిగుతామని హెచ్చరించింది. సోమవారం రోజు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పార్టీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌లను ఉద్దేశించి పోస్ట్ చేశారు. నిరసనకారులపై ఎలాంటి పోలీసు చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని పాటించడం లేదని ఆరోపించారు.బీహార్, బెంగాల్‌లో వందల మంది విద్యార్థుల్ని అరెస్ట్ చేశారని, ఢిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లో మిగతా 2వ పేజీలో



## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా మాధవి

### కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతికి కొత్త అధ్యక్షురాలు నియమితులయ్యారు. గత రెండు దశాబ్దాలుగా సంస్థను ముందుండి నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా మాత్రమే కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో సంస్థ కొత్త అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవికి బాధ్యతలను అప్పగిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిన కవిత. సంస్థ ప్రయాణంలో ఇది ఒక సరికొత్త అధ్యాయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక మిగతా 3వ పేజీలో

## టీడీపీలో 'గవర్నర్ కోటా' ఎమ్మెల్సీ లొల్లి

రెండు స్థానాలు.. రేసులో 20 మందికి పైగా దిగ్గజాలు!

03



## దుబాయ్ భారత కాన్సులేట్‌కు తొలి తెలుగు కాన్సుల్ జనరల్

- విష్ణువర్ధన్ రెడ్డి నియామకం ఖరారు.
- దుబాయ్ చరిత్రలో తొలిసారి తెలుగు దౌత్యవేత్తకు అత్యున్నత బాధ్యతలు.

03

## ఢిల్లీలో తెలంగాణ జర్నలిస్టుల గర్జన

- జర్నలిస్టుల హక్కుల కోసం గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్
- జంతర్ మంతర్ లో ధర్నా
- దండులా కదలివచ్చిన దేశవ్యాప్త జర్నలిస్టులు

03



## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

- తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షా లు
- వాతావరణ శాఖ హెచ్చరిక

03



## అవి చూస్తే వాంతులు వస్తున్నాయ్

జెన్ జీ నిరసనలపై ఎంపీ కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు

**ఢిల్లీ, మహా :** నీట్‌యుజి పేపర్ లీకేజీ, పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో జెన్ జీ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిరసనలకు సంబంధించిన వీడియోలు, రీల్స్ చూస్తుంటే తనకు 'వాంతులు వస్తున్నాయని' కంగనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పేర్కొన్నారు. అక్కడ 'అసహ్యం, చెత్త' తప్ప ఏమీ లేదని వ్యాఖ్యానించారు.





# ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

( మొదటి పేజీ తరువాయి )

ఈ ఎయిర్‌పోర్టు తొలి దశలోనే ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించే సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. విమానయాన రంగ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, మరో 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతాయని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఈ ప్రాజెక్టు కీలక కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆగస్టు 1న జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, అతిథుల స్వాగతం, వేదిక ఏర్పాట్లు తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొని ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సీఎంకు వివరాలు అందజేశారు.



# నేను స్ట్రీట్ ఫైటర్‌ను

- మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కౌంటర్
- రాజీనామా తర్వాత పార్లమెంటుకు వచ్చిన ప్రధాన్

**ఢిల్లీ, మహా :** నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతో కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని (స్ట్రీట్ ఫైటర్), ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో జరిగిన నిరసనల నేపథ్యంలో, ఆయన రాజీనామా చేయాలనే డిమాండ్ బలంగా వినిపించడంతో శనివారం ప్రధాన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. దేశ వ్యతిరేక శక్తులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకోకూడదని, విద్యార్థుల భవిష్యత్తు చట్టపరమైన చిక్కుల్లో పడకూడదనే ఉద్దేశంతోనే తాను రాజీనామా చేస్తున్నట్లు ఆయన తన ప్రకటనలో స్పష్టం చేశారు.

# పెద్దిని కాపాడండి.. ఏం చేస్తారో తెలియదు

- యశోదలో వైద్యులతో కేసీఆర్



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్ ఆసుపత్రికి వెళ్లారు. దాదాపు అర్ధ గంట పాటు అక్కడే ఉండి వైద్యులను అడిగి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం సుదర్శన్ రెడ్డికి అంతర్జాతీయ స్థాయి వైద్యం అందిస్తున్నామని, అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని కేసీఆర్ కు వైద్యులు వివరించారు. ఆయన అవయవాలన్నీ సరిగ్గా పనిచేస్తున్నాయని, మెదడు పనితీరు సాధారణ స్థితికి రావలసి ఉందని, దీనిపై స్పష్టత రావడానికి మరో 48 గంటల సమయం పడుతుందని తెలిపారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఎంత ఖర్చయినా సరే మెరుగైన వైద్యం అందించి పూర్తి కోలుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. వైద్యుల కృషి, దైవానుగ్రహం, ప్రజల ప్రార్థనలతో ఆయన త్వరలోనే కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఏం చేస్తారో ఏమో తెలీదు.. మా పెద్ది సుదర్శన్ రెడ్డిని మాత్రం కాపాడండి" అని వైద్యులకు చేతులు జోడించి విజ్ఞప్తి చేశారు.

# జగన్ తో బహిరంగ చర్చకు రెడీ

- డీఎస్సీపై లోకేష్ సవాల్
- జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' జబ్బు ఉందని ఎద్దేవా



**అమరావతి, మహా :** డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌కు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సవాల్ విసిరారు. డీఎస్సీ అంశంపై జగన్‌తో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే చర్చకు రావాలని ఆయన అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్, జగన్ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "డీఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు నేను సిద్ధం. ఈ చర్చ కేవలం డీఎస్సీకే పరిమితం కాదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన లిక్కర్, భూ కుంభకోణాలపై కూడా చర్చిద్దాం" అని సవాల్ విసిరారు. 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత టీడీపీది అయితే, ఐదేళ్లలో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని నీచ చరిత్ర జగన్‌ది అని లోకేశ్ ధ్వజమెత్తారు. "వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు. మేము 150 రోజుల్లో అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే, దాన్ని అడ్డుకోవాలని 150 కేసులు వేశారు. ఆ కేసులన్నీ కోర్టులు కొట్టివేయడమే మా చిత్తశుద్ధికి నిదర్శనం" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం అభివృద్ధి, సంక్షేమం అయితే.. గొడ్డలి పార్టీ విధానం విధ్వంసం, బూతులు, బాబాయ్‌ను గొడ్డలితో లేపేయడం, తల్లి, చెల్లిని ఇంటి నుంచి తరిమేయడం అని లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు 'క్రెడిట్ చోర్ డిజార్డర్' (సీసీడీ) అనే జబ్బు ఉందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీసుకొచ్చిన ఆర్సెలర్ మిట్టల్, గూగుల్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం ఆయనకున్న జబ్బు లక్షణమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని లోకేశ్ తెలిపారు. ప్రభుత్వ విజయాలను, వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నూటికి నూరు శాతం స్థానాలు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# రంగనాథ్‌ను తప్పించండి

( మొదటి పేజీ తరువాయి )



హైడ్రా సారథ్యం నుంచి రంగనాథ్‌ను వెంటనే తప్పించి, ఆయన స్థానంలో ఐజీ స్థాయి కలిగిన ఐపీఎస్ అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో సంచలనంగా మారింది. లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్లు 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూ వివాదంలో శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై జరిగిన విచారణలో న్యాయస్థానం అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒకే అధికారిపై ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడం ఆశ్చర్యకరమని, వ్యవస్థలు చట్ట పరిధికి లోబడి నడుచుకోవాలి కానీ చట్టానికి అతీతంగా వ్యవహరించకూడదని కోర్టు స్పష్టం చేసింది. కేవలం ఒక జీవో ద్వారా ఉనికిలోకి వచ్చిన ఏజెన్సీ, సివిల్ కోర్టుల, హైకోర్టుల స్టే ఉత్తర్వులను పక్కనపెట్టి చర్యలు చేపట్టడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని తేల్చిచెప్పింది.

**ఒక్క అధికారిపై 63 ధిక్కరణలా?**

హైకోర్టు కఠిన వైఖరితో స్పందించిన నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కోర్టు ఆదేశాల మేరకు పూర్తిస్థాయి అఫిడవిట్‌ను దాఖలు చేశారు. న్యాయస్థానం సూచించిన విధంగా ఆయన తన అఫిడవిట్‌లో క్షమాపణ పత్రాన్ని పొందుపరిచారు. న్యాయవ్యవస్థపై, ఉన్నత న్యాయస్థానం గౌరవప్రతిష్ఠలపై తనకు అత్యున్నత గౌరవం ఉందని, కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించే ఆలోచన తనకు ఏమాత్రం లేదని రంగనాథ్ పేర్కొన్నారు. పిటిషనర్ పేర్కొన్నట్లుగా తాము వివాదాస్పద 40 ఎకరాల స్థలంలోకి ప్రవేశించలేదని, వాస్తవాలను దాచి పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించారని తన అఫిడవిట్‌లో నివేదించారు. హైడ్రా చేపడుతున్న చెరువులు, ఆక్రమణల పునరుద్ధరణ చర్యలు మంచివే అయినప్పటికీ, అనుసరిస్తున్న పద్ధతి రాజ్యాంగబద్ధంగా ఉండాలని కోర్టు హితవు పలికింది. ఒక్క అధికారిపై 63 ధిక్కరణలా? అంటూ ఆగ్రహించింది. పోలీసు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం మొత్తం హైడ్రా నిర్ణయాలపైనే ఆధారపడుతుండటాన్ని తప్పుబడుతూ, అధికారులకు చట్టం ముందు అందరూ సమానులే అనే భావన ఉండాలని పేర్కొంది. రాజ్యాంగబద్ధమైన జవాబుదారీతనం, పారదర్శకతను పునరుద్ధరించడానికి ఐజీ స్థాయి అధికారికి నేతృత్వ బాధ్యతలు అప్పగించడమే సరైన మార్గమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఒకవైపు ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్నందుకు రంగనాథ్‌కు ప్రజాదరణ లభించినప్పటికీ, న్యాయస్థానాల ఆదేశాలను బేఖాతరు చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ఇకపై ఏ చట్టపరమైన చర్యలు చేపట్టినా కోర్టు ముందస్తు అనుమతులు మరియు నిర్దేశిత ప్రక్రియను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ఈ సంచలన తీర్పు స్పష్టం చేసినట్లైంది. మరోవైపు హైకోర్టు తీర్పు అంశాన్ని ఐబీ సీఎం పరిశీలనకు తీసుకెళ్ళగా, తదుపరి అంశంపై న్యాయనిపుణులతో చర్చించాలని సీఎస్ కు సీఎం సూచించినట్లు సమాచారం.

## రాజ్యాంగ స్ఫూర్తితోనే పనిచేశా

**హైకోర్టు తీర్పుపై 'హైడ్రా' చీఫ్ రంగనాథ్**

**హైదరాబాద్, మహా :** 'హైడ్రా' కమిషనర్‌గా రంగనాథ్‌ను తప్పించాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన ప్రభుత్వ కార్యదర్శికి సంజయ్ జాజుకు సంచలన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిందే. ఈ నేపథ్యంలో హైకోర్టు ధర్మాసనం తీర్పుపై తాజాగా ఏవీ రంగనాథ్ రియాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాము పూర్తిగా రాజ్యాంగ స్ఫర్తితో పనిచేస్తున్నామని, చెరువులు, ప్రభుత్వం ఆస్తులు కాపాడటమే హైడ్రా లక్ష్యమని అన్నారు. ఇప్పటి వరకు రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వం ఆస్తులను పరిరక్షించామని గుర్తు చేశారు. దాదాపు 6 చెరువులను పూర్తిగా పునరుద్ధరించామని అన్నారు. మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల కబ్జా భూములను వెనక్కి తీసుకుని, తిరిగి ప్రభుత్వానికి అప్పగించిందని పేర్కొన్నారు. అదేవిధంగా లోతుకుంటలో భూ కబ్జా యత్నాన్ని అడ్డుకున్నామని అన్నారు. కానీ, ల్యాండ్ మాఫియా కోర్టును తప్పుదోవ పట్టిస్తోందని, తనపై ఉన్న కోర్టు ధిక్కార నోటీసులన్నీ భూ కబ్జాదారులవేనని తెలిపారు.

# ఒప్పందం ఉల్లంఘించిన కేంద్రం

(మొదటి పేజీ తరువాయి )




ఆందోళనకు మద్దతు ఇచ్చిన వాలంటీర్లను పోలీసులు వేధిస్తున్నారని రాంకా ట్వీట్ చేశారు. నిరసనకారులపై రిజిస్టర్ అయిన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే రద్దు చేయాలని, ఇప్పటికే అదుపులోకి తీసుకున్న విద్యార్థుల్ని విడుదల చేయాలని అన్నారు. ఇంకా భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాంకా జులై 25న మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో జరిగిన మూడో విడత చర్చల్లో కీలక ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. జంతర్ మంతర్ నిరసనలు, జులై 20న జరిగిన ఆందోళనతో పాటు దేశవ్యాప్తంగా జరిగిన నిరసనలకు సంబంధించి నిరసనకారులు, నిర్వాహకులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్న ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. భవిష్యత్తులో కూడా కొత్త కేసులు నమోదు చేయబోమని హామీ ఇచ్చిందన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించిన డ్రాఫ్ట్ పేపర్లను తాము ఇప్పటికే జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌కు అందజేశామని, మంగళవారం నాటికి ప్రభుత్వం కూడా లిఖితపూర్వక ఒప్పంద ప్రతిని అందిస్తామని చెప్పిందని ఆశుతోష్ రాంకా అన్నారు. ఇరు పక్షాల న్యాయవాదులు పరిశీలించిన తర్వాత తుది ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. మంగళవారం లోపు ప్రభుత్వం లిఖితపూర్వక ఒప్పందాన్ని అందించకపోతే, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న విద్యార్థులు, యువతను విడుదల చేయకుంటే కాక్రోచ్ జనతా పార్టీ మళ్లీ దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పార్లమెంటులో కూడా ఈ అంశం ప్రతిధ్వనించింది. బిహార్‌లో విద్యార్థులపై పోలీసుల చర్యలు, కాల్పుల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దీనికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# హైడ్రాను రద్దు చేయాలి

**పేదల ఇళ్లే లక్ష్యంగా చర్యలు: బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు.**

హైదరాబాద్, మహా : రాష్ట్రంలో హైడ్రాను వెంటనే రద్దు చేస్తేనే పేదల ఇళ్లు సురక్షితంగా ఉంటాయని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆయన సోమవారం స్పందిస్తూ, ఈ తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు రంగనాథ్‌ను బలిపశువును చేశారని ఆరోపించారు. హైడ్రా చర్యలు చట్టబద్ధత పేరుతో సాగినా, ఆచరణలో మాత్రం పేదల ఇళ్లపైనే ఎక్కువగా దృష్టి సారించాయని రాంచందర్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఎంఐఎం కనుసన్నల్లోనే హైడ్రా పనిచేసిందని ఆరోపిస్తూ, ప్రభావశీల వ్యక్తులు, పెద్ద సంస్థల జోలికి వెళ్లకుండా సాధారణ ప్రజలనే లక్ష్యంగా చేసుకుందని అన్నారు. ఫాతిమా కాలేజీ వంటి వివాదాస్పద నిర్మాణాలు, బడా భూ కబ్జాదారుల విషయంలో హైడ్రా చర్యలు కనిపించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైడ్రాను రద్దు చేసి, పేదల ఆస్తులను రక్షించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో జరుగుతున్న చర్యలు ప్రజల్లో భయాందోళనలు కలిగించాయని, వాటిపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా, లోతుకుంట ప్రభుత్వ భూముల కేసు విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం సెక్రటరీ హోదాలో ఉన్న అధికారికి తగదని వ్యాఖ్యానించిన ధర్మాసనం, ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అర్హత కలిగిన అధికారిని ఆ స్థానంలో నియమించాలని సూచించిన న్యాయస్థానం, రంగనాథ్ కొనసాగితే 'రూల్ ఆఫ్ లా' దెబ్బతింటుందని స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయనను అదే పదవిలో కొనసాగించడం సమంజసం కాదని పేర్కొంది. హైకోర్టు ఆదేశాలను ప్రతిపక్షాలు స్వాగతించాయి. బీజేపీతో పాటు బీఆర్ఎస్ కూడా న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతిస్తూ, హైడ్రా వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి.

# రెచ్చిపోయిన డ్రగ్స్ మాఫియా

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాపై నిఘా పెట్టిన పోలీసులపై ఓ నిందితుడు కారుతో దూసుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది. డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు భావిస్తున్న యువకుడు తనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై వాహనం ఎక్కించడంతో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఇన్‌స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్‌కు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్‌లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి బెలెనో కారులో వచ్చిన సైఫ్‌కు మరో వ్యక్తి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారులో ఉన్న సైఫ్‌ను బయటకు రావాలని ఆదేశించారు. అయితే కారు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపి పోలీసులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. వైద్యుల పరీక్షల్లో అతడి కాలు విరిగినట్లు నిర్ధారణ కావడంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నిందితుడిని అడ్డుకునే ప్రయత్నంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన తర్వాత పరారయ్యేందుకు ప్రయత్నించిన సైఫ్‌ను పోలీసులు వెంటాడి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారుతో పాటు అదుపులోకి తీసుకున్నారు. హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, ప్యాకెట్‌లోని పదార్థం, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై విచారణ కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఫ్యామిలీ రిజిస్టర్

**ఒక్క రికార్డు.. అనేక సేవలు**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పౌరులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో త్వరలోనే 'ఫ్యామిలీ రిజిస్టర్' (కుటుంబ రికార్డు) విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. పౌరులందరికీ ఒకే రకమైన ప్రామాణిక కుటుంబ రికార్డును అందించడమే లక్ష్యంగా ఈ సరికొత్త వ్యవస్థను రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డుల డేటాను ప్రాతిపదికగా తీసుకుని ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌ను ప్రభుత్వం సిద్ధం చేయనుంది. దీని ద్వారా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల వివరాలన్నింటినీ ఒకే రిజిస్టర్‌లో భద్రపరుస్తారు. దీనివల్ల వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో కుటుంబ వివరాల ధృవీకరణ ప్రక్రియ చాలా సులభతరం కానుంది.

**రెండు రోజుల్లోనే సర్టిఫికెట్**

ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పౌరులు తమకు సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా లేదా ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న కేవలం రెండు పని దినాల్లోనే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను జారీ చేసేలా అధికారులు ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నారు. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ పథకాలకు వేర్వేరు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే.. అన్ని రకాల ప్రభుత్వ సేవలకు, సంక్షేమ పథకాల లబ్ధికి ఈ 'ఒకే కుటుంబ రికార్డు' ప్రామాణికంగా మారుతుంది. దీనివల్ల ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించనున్నారు.

# చెవిరెడ్డికి సుప్రీంలో ఎదురుదెబ్బ

**లిక్కర్ స్కాం కేసులో పిటిషన్ తిరస్కరణ.**

అమరావతి, మహా : ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాం కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కేసులో నిందితుడైన దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరైన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ)ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌ను విచారించి తిరస్కరించింది.

విచారణ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తరఫున పలు అభ్యంతరాలు, సందేహాలు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అయితే కేసు దర్యాప్తు లేదా తదుపరి న్యాయ ప్రక్రియలో తలెత్తే అంశాలపై సరైన సమయంలో తగిన అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రస్తుతం ముందస్తు బెయిల్‌ను రద్దు చేసే పరిస్థితులు కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించే ప్రయత్నం జరుగుతోందని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మంజూరైన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

``ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్‌లుగా మార్చి, తద్వారా వైఎస్ జగన్‌ను కేసులో ఇరికించేందుకు కూటమి ప్రభుత్వం, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి గతంలో ఆరోపించారు. ఇదే అంశాలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.

అయితే ఈ దశలో పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు, భవిష్యత్తులో కేసు విచారణలో అవసరమైతే చట్టప్రకారం తగిన సమయంలో కోర్టును ఆశ్రయించవచ్చని చెవిరెడ్డికి సూచించింది. దీంతో లిక్కర్ స్కాం కేసు దర్యాప్తు, న్యాయ ప్రక్రియ యథావిధిగా కొనసాగనున్నట్లు స్పష్టమైంది.




# హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన వరంగల్ సీపీ

**రౌడీ షీటర్ల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలి**

**వరంగల్, క్రైమ్ ;** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ సోమవారం సెంట్రల్ జోన్ పరిధి లోని హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ఏ మహేందర్ పూల మొక్కను అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించడంతో పాటు, స్టేషన్ లో విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను పరిశీలించడం తో పాటు, స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. అంతేకాకుండా స్టేషన్ పరిధిలో తరుచు అధిక సంఖ్యలో జరిగే నేరాలు, స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ప్రస్తుత గ్రామాల్లో స్థితిగతులు, స్టేషన్ నిర్వహణ, పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ మహేందర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులు, సిబ్బంది ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్నామని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని తో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఫిర్యాదుదారునికి రశీదు అందజేయాలని, శాంతి భద్రతలకు సంబంధించి సీపీ ప్రస్థావిస్తూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని, నేరాల నియంత్రణ కై ప్రజల బాగ స్వామ్యం తో సీసీ కెమెరాలు ఏర్పాటు పై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మహిళల పై జరిగే నేరాల పై తక్షణమే స్పందించాలని, చోరీ ల నియంత్రణకు పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, నమోదైన కేసుల పై నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేపట్టాలని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# దుబాయ్ భారత కాన్సులేట్‌కు తొలి తెలుగు కాన్సుల్ జనరల్

- విష్ణువర్ధన్ రెడ్డి నియామకం ఖరారు.
- దుబాయ్ చరిత్రలో తొలిసారి తెలుగు దౌత్యవేత్తకు అత్యున్నత బాధ్యతలు.

దుబాయ్, మహా: ప్రపంచంలోనే అత్యంత కీలకమైన భారతీయ దౌత్య కేంద్రాల్లో ఒకటైన దుబాయ్ భారత కాన్సులేట్‌కు తొలిసారిగా ఓ తెలుగు దౌత్యవేత్త అత్యున్నత బాధ్యతలు చేపట్టనున్నారు. 2008 బ్యాచ్‌కు చెందిన భారత విదేశాంగ సేవ (ఐఎఫ్ఎస్) అధికారి డాక్టర్ ఇమ్మడి విష్ణువర్ధన్ రెడ్డిని దుబాయ్ భారత కాన్సుల్ జనరల్‌గా నియమించనున్నట్లు సమాచారం. అధికారిక ప్రకటన వెలువడితే, దుబాయ్ కాన్సులేట్ అర్ధశతాబ్ద కాల చరిత్రలో ఈ పదవిని చేపట్టిన తొలి తెలుగు అధికారి అనే అరుదైన గౌరవం ఆయనకు దక్కనుంది.



ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య విద్యను అభ్యసించిన అనంతరం భారత విదేశాంగ సేవలో చేరారు. విదేశాంగ రంగంలో విశేష అనుభవం కలిగిన ఆయన ఐరోపా, అమెరికా ఖండాల్లోని భారత మిషన్లతో పాటు ఐక్యరాజ్యసమితిలోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల వరకు డిప్యూటేషన్‌పై తెలంగాణ ప్రభుత్వంలో పెట్టుబడులు, పరిశ్రమల వ్యవహారాలను పర్యవేక్షించగా, అంతకుముందు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారిగా కూడా సేవలందించారు.దాదాపు 40 లక్షల మంది భారతీయులు నివసిస్తూ, ఉపాధి పొందుతున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో దుబాయ్ భారత దౌత్య పరంగా అత్యంత కీలక కేంద్రంగా గుర్తింపు పొందింది. భారత విదేశీ వాణిజ్యంలోనూ యూఏఈ ప్రధాన భాగస్వామ్య దేశాల్లో ఒకటిగా ఉండటంతో, దుబాయ్ కాన్సుల్ జనరల్ పదవికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

విష్ణువర్ధన్ రెడ్డి నియామకం అధికారికంగా ఖరారైతే, గల్ఫ్ దేశాల్లో అత్యున్నత భారతీయ దౌత్య పదవుల్లో పనిచేస్తున్న తెలుగు అధికారుల సంఖ్య మరింత పెరగనుంది. ప్రస్తుతం సౌదీ అరేబియాలోని జెడ్డాలో ఫహాద్ ఖాన్ సూరి, ఖతార్‌లో కొప్పుల శ్రీకర్ రెడ్డి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఒమాన్‌లో జి.వి. శ్రీనివాస్, సౌదీ అరేబియాలో డాక్టర్ ఔసాఫ్ సయీద్ వంటి భారతీయ దౌత్యవేత్తలు కూడా విశిష్ట సేవలందించారు.దుబాయ్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన దౌత్య కేంద్రానికి తెలుగు అధికారి నియామకం కావడం తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రవాస భారతీయుల్లోనూ ఆనందాన్ని నింపుతోంది. భారత-యూఏఈ సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, అక్కడి భారతీయుల సంక్షేమం కోసం ఆయన సేవలు మరింత ఉపయోగపడతాయని దౌత్య వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# బొద్దింకల జోలికి రాకండి వాటి సత్తా అందరికీ తెలిసింది

- ప్రజాస్వామ్యంలో ప్రజలు భయపడాల్సిన పని లేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్

**ముంబై, మహా :** కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. 'మేం విజయం సాధించాం.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చింది, వాటి జోలికి రాకండి' అని వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి తలొగ్గకుండా నిలబడితే ఎవరిచేతనైనా రాజీనామా చేయించవచ్చునన్న విషయం ప్రధాన్ రాజీనామా ద్వారా రుజువైందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు భయపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. కాగా, తనకు టైఫాయిడ్ వచ్చినట్టు పరీక్షల్లో నిర్ధారణ అయ్యిందని, దానికి చికిత్స పొందుతున్నట్టు దీప్కే ప్రకటించారు.

తాము నిర్వహించిన ఉద్యమ లక్ష్యం నెరవేరిందన్నారు. ఈ సందర్భంగా తమ ఉద్యమంపై వ్యతిరేక ప్రచారం చేసిన ప్రభుత్వ అనుకూల మీడియాపై మండిపడ్డారు.

'మాది తప్పుడు ఉద్యమమంటూ ప్రచారం చేసిన గోదీ మీడియా ఇప్పుడు ఎక్కడికి పోయింది.? విద్యార్థుల ఐక్యత కారణంగానే ఈ ఉద్యమం విజయవంతమైంది' అని పేర్కొన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే జంతర్ మంతర్ వద్ద ఆందోళనలో ఉన్న యువత, విద్యార్థులు, మద్దతుదారులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేస్తూ వేడుకలు ప్రారంభించారు.

**ఇది ప్రజాస్వామ్య విజయం : వాంగ్ చుక్**

మంత్రి రాజీనామాపై పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్ స్పందిస్తూ ఇది ప్రజాస్వామ్య విజయమని పేర్కొన్నారు. 'ప్రత్యక్ష ప్రజాస్వామ్యం.. నేరుగా వీధుల నుంచే.. ఇది శాంతి, సహనం, పట్టుదల విజయం' అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమానికి నేతృత్వం వహించిన సీజేపీ, ఆందోళనలో పాల్గొన్న జెన్ జీని అభినందించారు. భయాన్ని వీడి దేశంలోని ప్రతి మూల నుంచి వచ్చి ఆందోళనలో పాల్గొన్నందుకు ఆయన దేశ పౌరులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఢిల్లీలో తెలంగాణ జర్నలిస్టుల గర్జన

- జర్నలిస్టుల హక్కుల కోసం గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్
- జంతర్ మంతర్ లో ధర్నా
- దండులా కదలివచ్చిన దేశవ్యాప్త జర్నలిస్టులు

**న్యూఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పై తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పాత్రికేయులు పార్లమెంటు సమీపంలోని జంతర్ మంతర్ లో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో పార్లమెంట్" పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఢిల్లీ తరలివచ్చిన పాత్రికేయులు ధర్నాలో పాల్గొని సమస్యలపై గొంతెత్తారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరి పక్షాన తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నా చేయడం అభినందనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని అన్నారు.ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ఈ ధర్నాలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ ధర్నాలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యులు మాన్విక మిశ్రా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, కుడుతాడి బాపురావు, కే. రమాదేవి, జగదీశ్వర్, పద్మనాభ రావు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, రిటైర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్ష తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు అందజేశారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం భీమారంలోని రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ఉన్న కారణంగా ఇప్పటివరకు తక్కువ వర్షపాతం నమోదు అయిందని చెప్పారు. రాబోవు 3 నెలలలో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వెల్లడించారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని సూచించారు. భూగర్భ జలం తక్కువగా ఉందని, రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని పేర్కొన్నారు. పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని అన్నారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించాలని ఆదేశించారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అందుకొరకు భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా మాధవి

( మొదటి పేజీ తరువాయి )

పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామనే దృఢ విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవం, ఆత్మగౌరవ పరిరక్షణే జాగృతి ప్రధాన ధ్యేయమని కల్వకుంట్ల కవిత గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా సాగుతున్న తరుణంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే సత్సంకల్పంతో 2006లో ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి బలమైన సాంస్కృతిక రూపాన్ని అందించడంలో జాగృతి అగ్రగామిగా నిలిచిందని, మన ప్రాంత ప్రత్యేకతలను దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు నిరంతరం శ్రమించిందని వెల్లడించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని, కొత్త నాయకత్వంలో సంస్థ మరింత బలోపేతమవుతుందనే పూర్తి ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. తెలంగాణ పల్లెలకే పరిమితమైన




అపురూపమైన బతుకమ్మ పండుగను నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి చేసిన కృషి చరిత్రాత్మకమని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున సంఘటితం చేసి, తెలంగాణ ఉద్యమంలో వారిని క్రియాశీల భాగస్వామ్యులను చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుందని కొనియాడారు. కేవలం రాజకీయ, ఉద్యమ వేదికగానే కాకుండా అనేక సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తమ సంస్థ నిరంతరం కృషి చేసిందని వివరించారు. రాబోయే రోజుల్లోనూ ప్రజా సంక్షేమం, సాంస్కృతిక పరిరక్షణే లక్ష్యంగా జాగృతి తన ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనుందని చెప్పారు. తెలంగాణ జాగృతి స్థాపించిన నాటి నుంచి సంస్థ చేపట్టిన వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో మాధవి చురుగ్గా పాల్గొంటున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో సాంస్కృతిక చైతన్యం తీసుకురావడంలో, ముఖ్యంగా పల్లె పల్లెనా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించి మహిళలను ఉద్యమబాట పట్టించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. గతంలో జాగృతి తరపున వివిధ స్థాయిల్లో, ముఖ్యంగా మహిళా విభాగాలు, వివిధ జిల్లాల కోఆర్డినేషన్‌లలో నాయకత్వ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించిన ఆమెను తాజాగా అధ్యక్షురాలిగా ప్రకటించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

**తెలంగాణలో మరో నాలుగు రోజులు వర్షా లు**

**వాతావరణ శాఖ హెచ్చరిక**



హైదరాబాద్, మహా : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఈ అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని కూడా పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్ నగర్, రంగారెడ్డి, సిద్దిపేట, జనగాం, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, నారాయణపేటలో కూడా వానలు పడనున్నాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లోనూ వాతావరణం చల్లబడింది. కొన్ని ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి. జూబ్లీహిల్స్, అమీర్‌పేట, పంజాగుట్ట, మాదాపూర్, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లలో సోమవారం ఉదయం నుంచి అడపాదడపా వర్షం కురిసింది. హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు.. అనవసరంగా బయటకు రావడం మానుకోవాలని సూచించారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలను అప్రమత్తం అయ్యారు. డ్రైనేజీ వ్యవస్థలలో నీరు నిలవడాన్ని తనిఖీ చేస్తున్నారు. అంతేకాకుండా ఆదివారం తెలంగాణలోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో అత్యధికంగా 7.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ నగరంలో 1.6 నుంచి 2.7 సెం.మీ మధ్య వర్షపాతం నమోదు కాగా, హయత్‌నగర్‌లో అత్యధికంగా 2.7 సెం.మీ, పెద్ద అంబర్‌పేటలో 1.8 సెం.మీ, బండ్లగూడ, పసుమాములలో 1.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఆకాశం మేఘావృతమై, తడి వాతావరణం కారణంగా హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. ఐఎమ్‌డీ హైదరాబాద్ ప్రకారం సోమవారం పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు 22 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సుమారు 33 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఇది గణనీయమైన తగ్గుదలగా ఉంది.

# టీడీపీలో 'గవర్నర్ కోటా' ఎమ్మెల్సీ లొల్లి

**రెండు స్థానాలు.. రేసులో 20 మందికి పైగా దిగ్గజాలు!**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఖాళీ అవుతున్న రెండు 'గవర్నర్ నామినేటెడ్' ఎమ్మెల్సీ స్థానాల భర్తీ టీడీపీ అధిష్ఠానానికి పెద్ద పరీక్షగా మారింది. ప్రస్తుత ఎమ్మెల్సీలు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జాకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీ కాలం ముగియనుండటంతో ఆ స్థానాలను దక్కించుకునేందుకు పార్టీలో తీవ్రస్థాయిలో పోటీ నెలకొంది. రెండు పదవుల కోసం దాదాపు 20 మందికి పైగా సీనియర్ నేతలు, ఆశావహులు క్యూ కట్టడంతో రాజధాని రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు. సామాజిక వర్గాలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, రాజకీయ సమీకరణాలను సమతుల్యం చేస్తూ సరైన అభ్యర్థులను ఎంపిక చేసేందుకు బాబులోకేష్ ద్వయం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల ధర్మానికి కట్టుబడి సీట్లు త్యాగం చేసిన నేతలు, ఇటీవలి రాజ్యసభ నామినేషన్లలో అవకాశం తప్పిపోయిన సీనియర్లు ఈసారి తమకే ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని కోరుతున్నారు. ఈ మేరకు చంద్రబాబు, లోకేష్‌లను కలిసి స్వయంగా వినతిపత్రాలు సమర్పించడంతో పాటు గట్టిగా ప్రతిపాదనలు పంపుతున్నారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ జాకియా ఖానం, ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుల పదవీ కాలం ముగియనుండటంతో నేడో రేపో అధిష్ఠానం తుది జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది. సుదీర్ఘ అనుభవం, త్యాగాలు, రాజకీయ సమీకరణాల నడుమ చంద్రబాబు నాయుడు ఎవరి వైపు మొగ్గు చూపుతారోనని పసుపు శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

**రేసులో ఎవరెవరు?**

ఆశావహుల జాబితాలో ఉమ్మడి కృష్ణా జిల్లా నేతల హవా ఎక్కువగా కనిపిస్తోంది. సీనియర్ నాయకులు వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, వంగవీటి రాధాకృష్ణ, టీడీ జనార్దన్, గొట్టిపాటి రామకృష్ణ, బుద్ధా వెంకన్నలు ఈ పదవిపై కన్నేశారు.. రాయలసీమకు ఒక సీటు?: పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. రెండు స్థానాల్లో ఒకదానిని రాయలసీమ ప్రాంతానికి కేటాయించే అవకాశం మెండుగా ఉంది. సీమ నుంచి రెడ్డప్పగారి శ్రీనివాస్ రెడ్డి, తిప్పేస్వామి, బీటెక్ రవి, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ ప్రకృతి వైద్యులు మంతెన సత్యనారాయణరాజు మరోసారి ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. దివ్యాంగుల కోటా: గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ వికలాంగుల కోటా కింద తనకు అవకాశం కల్పించాలని గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. బ్రాహ్మణ సామాజికవర్గ ప్రతినిధిగా తనకు మండలిలో అవకాశం ఇవ్వాలని సీనియర్ నేత ఏవీ రమణ అధిష్ఠానాన్ని కోరుతున్నారు.

# ఆపరేషన్ విజయ్: మంచు కొండల్లో రగిలిన అగ్నిజ్వాల.. ఈ సాహస గాథ



సముద్ర మట్టానికి 16,000నుండి 18,000అడుగుల ఎత్తు, రక్తాన్ని గడ్డకట్టించే మైనస్ పదిహేను డిగ్రీల టెంపరేచర్... శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా ఉండే ఆ భీకరమైన మంచు కొండల్లో, ఒక దేశం తన ఉనికిని చాటుకునేందుకు చేసిన ప్రాణత్యాగాల వీర గాథే ఈ కార్గిల్ వార్. 19981999 వింటర్ లో అప్పుడే పాకిస్తాన్‌భారత్ మధ్య శాంతి కోసం లాహోర్ అగ్రిమెంట్ కుదిరింది. కానీ, ఆ అగ్రిమెంట్ కేవలం ఒక నాటకం మాత్రమేనని అప్పుడు ఎవరికీ తెలియదు. కాశ్మీర్ మరియు లడఖ్ మధ్య ఉన్న జీవనాడి లాంటి నేషనల్ హైవేని కట్ చేసి, ద్రాస్, బటాలిక్ సెక్టార్లను ఆక్రమించి, భారత దళాలను సియాచిన్ గ్లేసియర్ నుండి తరిమెయ్యాలనేది పాక్ ప్లాన్. టెర్రరిస్ట్స్ ముసుగులో పాక్ సైన్యం నియంత్రణ రేఖను (లైన్ ఆఫ్ కంట్రోల్) దాటి ఎత్తైన శిఖరాలపై తిష్టవేసింది, ఆ కుట్ర పేరే ఆపరేషన్ బదర్. మే 3, 1999న స్థానిక గొర్రెల కాపరులు కొండలపై గుర్తుతెలియని కదలికలను పసిగట్టారు, అసలు ఏం జరుగుతుందో తెలుసుకుందామని కెప్టెన్ సౌరభ్ కాలియా నేతృత్వంలో ఒక పెట్రోలింగ్ టీమ్ అక్కడికి వెళ్ళింది. కానీ ఊహించని విధంగా పాక్ బలగాలు వారిని బంధించి, దారుణంగా హింసించి చంపేశాయి. ఆ వీరుల డెడ్ బాడీస్ ని చూసిన తర్వాత భారత సైన్యానికి అర్థమైంది, శత్రువులు సాధారణ ఉగ్రవాదులు కారు, అత్యంత శిక్షణ పొందిన పాకిస్తాన్ రెగ్యులర్ ఆర్మీ అని! ఆ క్షణమే భారత సింహం గర్జించింది, ఆపరేషన్ విజయ్ మొదలైంది.బశత్రువులు ఎత్తైన శిఖరాలపై బంకర్లలో ఉన్నారు, మనవాళ్లు కింద నుంచి పైకి ఎక్కుతూ అటాక్ చేయాలి. ఇది మృత్యువుతో ఆడుకునే భయంకరమైన ఆట. మే 26న ఎయిర్ ఫోర్స్ 'ఆపరేషన్ సఫేద్ సాగర్' పేరుతో రంగంలోకి దిగి మిగ్21, మిగ్27, మిరాజ్ 2000 ఫైటర్ జెట్స్ నింగిలో మృత్యుదేవతల్లా చక్కర్లు కొడుతూ శత్రు స్థావరాలపై బాంబుల వర్షం కురిపించగా, నేవీ 'ఆపరేషన్ తల్వార్' పేరుతో అరేబియా సముద్రంలో పాకిస్తాన్ ఓడరేవులను దిగ్బంధించి వారి సప్లై చెయిన్ ని కట్ చేసి ఊపిరి ఆడకుండా చేసింది. దీనికి తోడు బంకర్లను ఛేదించడానికి భారత ఆర్టిలరీ ప్రయోగించిన బోఫోర్స్ తుపాకులు శత్రువుల వెన్నులో వణుకు పుట్టించాయి. ప్రాణాలను పణంగా పెట్టి, శత్రువుల బుల్లెట్స్ వర్షాన్ని ఎదుర్కొంటూ జూన్ 13న భారత సైన్యం 'తోలోలింగ్' శిఖరాన్ని తిరిగి తమ ఆధీనంలోకి తీసుకోవడం ఈ యుద్ధంలో ఒక టర్నింగ్ పాయింట్. ఆ తర్వాత జూలై 4న అత్యంత వ్యూహాత్మకమైన టైగర్ హిల్ పై పదకొండు గంటల పాటు జరిగిన భీకర రక్తపాతం తర్వాత, శత్రువులను చీల్చిచెండాడి మన మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

ఈ యుద్ధం నలుగురు సూపర్ హీరోస్ ని ప్రపంచానికి పరిచయం చేసింది, వారి అత్యున్నత సాహసాలకు భారత ప్రభుత్వం 'పరమ వీర చక్ర'ను ప్రదానం చేసింది. పాయింట్ 5140, 4875 లను కైవసం చేసుకునే మిషన్ లో తుపాకీ బుల్లెట్స్ దూసుకొస్తున్నా భయపడకుండా శత్రువులను మట్టుబెడుతూ "యే దిల్ మాంగే మోర్" అని గర్జించిన కెప్టెన్ విక్రమ్ బాత్రా, తీవ్ర గాయాలైనప్పటికీ వెనక్కి తగ్గకుండా పోరాడి నేలకొరిగిన లెఫ్టినెంట్ మనోజ్ కుమార్ పాండేల త్యాగాలు మరువలేనివి. అలాగే ఒంటిపై చాలాచోట్ల గాయాలై రక్తం పారుతున్నా ఒంటరిగా శత్రువుల పైకి దూకి వారిని నాశనం చేసిన గ్రెనేడియర్ యోగేంద్ర సింగ్ యాదవ్, ఏరియా ఫ్లాట్ టాప్‌ను స్వాధీనం చేసుకునే క్రమంలో శత్రువుల ఆయుధాలనే లాక్కొని వారిని మట్టుబెట్టిన రైఫిల్ మ్యాన్ సంజయ్ కుమార్‌ల సాహసం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడింది. క్షేత్ర స్థాయిలో సైన్యం శత్రువులను చంపుతుంటే, డిప్లొమాటిక్ లెవెల్ లో భారత ప్రభుత్వం పాకిస్తాన్ పరువు తీసింది, పాక్ అధికారుల ఫోన్ టేపులను ప్రపంచం ముందు పెట్టి అంతర్జాతీయంగా వారిని ఏకాకిని చేసింది. సుమారు అరవై రోజుల ఉత్కంఠ భరిత పోరాటం తర్వాత జూలై 26, 1999న భారత భూభాగం నుండి చివరి చొరబాటుదారుడిని కూడా తరిమికొట్టామని ఆర్మీ ప్రకటించింది. కానీ ఈ విజయానికి మనం చెల్లించిన మూల్యం చాలా పెద్దది, మన మాతృభూమి కోసం 527 మంది సైనికులు వీరమరణం పొందగా, 1,363 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. భవిష్యత్తులో ఇలాంటి ముప్పు రాకుండా ఉండాలని మన సెక్యూరిటీ సిస్టమ్స్ మరింత కట్టుదిట్టం చేసుకున్నాం. మనకు ప్రశాంతమైన నిద్రను బహుమతిగా ఇవ్వడానికి మంచు కొండల్లో తమ నెత్తురు చిందించిన ఆ వీర జవాన్ల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కనీస బాధ్యత, వారి డెడికేషన్, దేశభక్తి భావితరాలకు ఎప్పటికీ ఆదర్శం... జై హింద్!

**(శివకుమార్ గనివాడ,**
**సీనియర్ సామాజిక విశ్లేషకులు)**

# యువత ప్రశ్నలకు జవాబేదీ?

దేశ భవిష్యత్తు గురించి మాట్లాడేటప్పుడు మనం తరచూ "యువతే భారత బలం" అని చెబుతుంటాం. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న దేశంగా భారత్‌కు ఒకప్పుడు "డెమోగ్రాఫిక్ డివిడెండ్" అనే గొప్ప అవకాశం ఉందని ఆర్థికవేత్తలు, విధానకర్తలు విశ్వసించారు. కానీ నేడు పరిస్థితులు చూస్తే ఆ అవకాశం క్రమంగా ఆందోళనగా మారుతున్నట్లు కనిపిస్తోంది. విద్యలో అవినీతి, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, ఉద్యోగ అవకాశాల కొరత, నియామకాల్లో జాప్యం, యువతలో పెరుగుతున్న నిరాశ దేశ రాజకీయ వ్యవస్థ ముందున్న అత్యంత కీలక సవాళ్లుగా మారాయి.

ఇటీవలి రోజుల్లో విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత వీధుల్లోకి రావడం, ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా పోలీసుల జోక్యం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రజల అసంతృప్తిని ప్రభుత్వానికి తెలియజేసే శాంతియుత మార్గాలను గౌరవించడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యత. నిరసనలను అణచివేయడం కంటే వాటి వెనుక ఉన్న సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడమే సమర్థమైన పాలనకు నిదర్శనం.

ప్రస్తుతం దేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య పరీక్షలపై నమ్మకం కోల్పోవడమే. ఒక పరీక్ష కోసం లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడుతుంటారు. అలాంటి పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, అవకతవకలు, అక్రమాలు బయటపడితే విద్యార్థుల శ్రమ మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థపై ప్రజల విశ్వాసం కూడా దెబ్బతింటుంది. ప్రతిభకు బదులుగా అవినీతి గెలుస్తోందనే భావన యువతలో ప్రమాదకరమైన నిరాశను పెంచుతుంది.

ఇదే సమయంలో నిరుద్యోగం కూడా మరో పెద్ద సవాలుగా నిలుస్తోంది. చదువులు పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి అనేక కుటుంబాలను ఆర్థిక, మానసిక ఒత్తిడిలోకి నెడుతోంది. ప్రభుత్వ నియామక పరీక్షల ఆలస్యం, ఫలితాల వివాదాలు, కోర్టు కేసులు, రద్దైన పరీక్షలు యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న ప్రతి యువకుడి వెనుక ఒక కుటుంబం ఆశలు ఉంటాయి. ఆ ఆశలు పదేపదే దెబ్బతింటే అసహనం పెరగడం సహజం.

ఈ పరిస్థితుల్లో రాజకీయ పార్టీలు కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. యువత సమస్యలను కేవలం రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు పరిమితం చేయకుండా జాతీయ సమస్యగా చూడాలి. అధికార, ప్రతిపక్షాలు కలిసి విద్యా సంస్కరణలు, పారదర్శక నియామక వ్యవస్థ, పరీక్షల భద్రత, అవినీతిపై కఠిన చర్యలు వంటి అంశాలపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో యువతను ఓటర్లుగా మాత్రమే కాకుండా, విధానాల రూపకల్పనలో భాగస్వాములుగా గుర్తించాల్సిన సమయం వచ్చింది.

విద్యా వ్యవస్థలో సాంకేతికత వినియోగం, డిజిటల్ భద్రత, పరీక్షల నిర్వహణలో స్వతంత్ర పర్యవేక్షణ, ప్రశ్నాపత్రాల రహస్యతకు ఆధునిక ప్రమాణాలు అమలు చేయడం అత్యవసరం. అలాగే పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై రాజకీయ లేదా పరిపాలనా ప్రభావాలకు అతీతంగా వేగంగా విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలి. శిక్ష తప్పదనే సందేశం వెళ్లినప్పుడే ఇటువంటి నేరాలు తగ్గుతాయి.

యువత ఆవేదనను చట్టవ్యవస్థ సమస్యగా కాకుండా సామాజిక హెచ్చరికగా చూడాలి. దేశ అభివృద్ధికి ఇంజనీర్లు, వైద్యులు, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు అవసరం. వారిలో నిరాశ పెరిగితే అది వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తుకు కూడా నష్టం. అందుకే యువతతో ప్రభుత్వం నిరంతర సంభాషణ కొనసాగించాలి. విద్యార్థి సంఘాలు, నిపుణులు, విద్యావేత్తలు, పరిశ్రమల ప్రతినిధులతో కలిసి దీర్ఘకాలిక విద్యా, ఉపాధి విధానాలను రూపొందించాలి.

ప్రజాస్వామ్యం బలపడేది విమర్శలను అంగీకరించినప్పుడే. విభేదించే గొంతులను శత్రువులుగా కాకుండా భాగస్వాములుగా చూసే రాజకీయ సంస్కృతి పెరగాలి. శాంతియుత నిరసనలు ప్రజాస్వామ్యానికి బలహీనత కాదు; అవి ప్రజల విశ్వాసానికి ప్రతీక. యువత తమ భవిష్యత్తు గురించి ప్రశ్నలు అడుగుతున్నప్పుడు వాటికి సమాధానాలు ఇవ్వాల్సింది రాజకీయ నాయకత్వమే.

భారత్‌కు ఇంకా యువశక్తి అనే అపార సంపద ఉంది. కానీ ఆ సంపదను సద్వినియోగం చేసుకోవాలంటే విద్యపై నమ్మకం, ఉద్యోగాలపై ఆశ, పరిపాలనపై విశ్వాసం తిరిగి నెలకొల్పాలి. యువతను వినడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, పారదర్శకమైన సంస్కరణలు అమలు చేయడం ద్వారా మాత్రమే దేశం నిజమైన అభివృద్ధి దిశగా సాగుతుంది.

దేశ భవిష్యత్తు గురించి తీసుకునే ప్రతి నిర్ణయంలో యువత స్వరం వినిపించాలి. ఎందుకంటే నేటి విద్యార్థులే రేపటి భారత నిర్మాణ శిల్పులు. వారి ఆశలను కాపాడటం, అవకాశాలను కల్పించడం, న్యాయమైన వ్యవస్థను అందించడం ప్రతి ప్రభుత్వానిదీ, ప్రతి రాజకీయ పక్షానిదీ, అంతిమంగా ప్రతి ప్రజాస్వామ్య సమాజానిదీ బాధ్యత.

**అమరవాజీ నాగరాజు**
**జర్నలిస్ట్**





# కాక్రోచ్‌ల విజయం

కాక్రోచ్ జనతా పార్టీ అనేది సమకాలీన రాజకీయాల్లో కేవలం ఒక సంచలనం కాదు, అది ఒక వ్యవస్థాగత తిరుగుబాటుకు సజీవ సాక్ష్యం. నిరుద్యోగులు బొద్దింకలు అన్నట్టుగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారన్న ఆరోపణలతో దీని వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే ఆవేదనలోంచి పుట్టుకొచ్చిన ఒక చిన్న సామాజిక మాధ్య ఉద్యమం. ఇంతింతై వటుడింతై అన్న చందంగా కేవలం మొదలైన కొద్ది కాలంలోనే దేశ వ్యాప్తంగా 2 కోట్ల మంది ఫాలోవర్లతో రికార్డు సృష్టించింది. నీట్ పేపర్ లీకై విద్యార్థుల ఆవేదన ..ఆత్మహత్యలకు చలించి న్యాయ కోసం ఢిల్లీ వేదికగా నిరసన ప్రదర్శనలు చేపట్టింది.నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ కు మద్దతుగా అగ్నికి ఆజ్యం తోడైనట్టుగా సామాజిక కార్యకర్త వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్షతో విద్యార్థిలోకం కదిలివచ్చింది. లాఠీలకు పెల్లెట్ లకు గాయాలైనా ఎదురొడ్డి నిలిచి పోరాడింది.కేంద్ర పెద్దలు ఆసుపత్రిలో వాంగ్ చుక్ దీక్ష విరమింపచేసినా విద్యార్థులు యువత ఉద్యమం మాత్రం ఆగలేదు. విద్యార్థులు యువతను కూడకట్టుకొని నేడు ఒక మహోద్యమంగా మారి ఏకంగా ఒక కేంద్ర మంత్రినే రాజీనామా చేయించే స్థాయికి ఈ ఉద్యమం ఎదిగింది.ప్రజాస్వామ్యంలో ప్రజల అసంతృప్తికి సరైన వేదిక దొరికితే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఈ పరిణామం నిరూపించింది. అయితే మొదట్లోనే ఓ బీజేపీ కేంద్ర మంత్రి సీజేపీ సోషల్ మీడియా ఖాతా ఫాలోవర్లలో 49 శాతం మంది పాకిస్తాన్ నుంచే ఉన్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండిస్తూ ..ఆడియన్స్ డేటా గణాంకాల ప్రకారం తమకున్న ఫాలోవర్లలో 94 శాతం మంది భారతీయులేనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.అంతే కాదు నిరసనలకు విదేశీ శక్తుల మద్దతు ఉందని చూపించడానికి జమాత్‌ఎఇస్లామీ పేరుతో సోషల్ మీడియాలో చలామణి అయిన ఒక మద్దతు లేఖ పూర్తిగా నకిలీ అని ఫ్యాక్ట్‌చెక్ సంస్థల దర్యాప్తులో సైతం తేలింది.

**మొదటి గెలుపు**

సీజేపీ తమ నిరసనలతోకేంద్ర మంత్రినే రాజీనామా చేయించిన ఉదంతం ఉద్యమ తొలి విజయం గా అభివర్ణించవచ్చు. ఎందుకంటే ఒక కేంద్ర మంత్రి నిరసనకారుల డిమాండ్ లకు తలొగ్గి రాజీనామా చేయడమనేది మామూలు విషయం కాదు. అంతే కాదు ఒక మంత్రి రాజీనామా చేసినంత మాత్రానా సమస్య పరిష్కరించబడుతుందా అంటే కూడా అవుననలేం. కాని కొత్తగా మొదలైన ఈ కాక్రోచ్ జనతా పార్టీకి ఈ పరిణామం మున్ముందు జరిగే మార్పులకు ఒక ఊతమిస్తుందనడంలో సందేహం లేదు.

ఏ ప్రభుత్వమైనా ప్రజా ఆందోళనలను తొలినాళ్లలో తక్కువగా అంచనా వేస్తుంది. కానీ కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన ప్రజా ఒత్తిడి ఊహాతీతం. ఉద్యమ తీవ్రతకు, ప్రజా ఆగ్రహానికి తలొగ్గి ఒక కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి రావడం ఈ ఉద్యమ నైతిక విజయానికి నిదర్శనం. ఇది కేవలం ఒక వ్యక్తి రాజీనామా కాదు, పాలకుల పీఠాలు కదిలించగల శక్తి సామాన్యుడికి ఉందని నిరూపించిన సందర్భం.

**రాజకీయ పార్టీగా మారితే**

ఈ కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పుడు ఒక పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా రూపాంతరం చెందితే కేంద్రంలో ఉన్న అధికార పీఠానికి ముప్పు తప్పదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికి కొన్ని ముఖ్య కారణాలను విశ్లేషించుకుందాం.. విద్యార్థులు, యువత వారి తల్లిదండ్రులు ప్రజల మద్దతుతో ఇప్పటికే కోట్లాది మంది అండ ఉండటం వల్ల వీరికి ఓటు బ్యాంకును నిర్మించుకోవడం సులభం అవుతుంది. సాంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా సరికొత్త పంథాలో నడుస్తున్నందున ఈ పార్టీ వైపు ఎక్కువగా ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సమఉజ్జీగా ప్రతిపక్షాల వైఫల్యాల నేపథ్యంలో, ప్రజలు బలమైన ప్రత్యామ్నాయంగా కాక్రోచ్ జనతా పార్టీ ని చూసే అవకాశం ఉంది.సాధారణంగా ఒక రాజకీయ భావజాలం ప్రజల్లోకి వెళ్లడానికి దశాబ్దాలు పడుతుంది. కానీ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ ఉద్యమం కేవలం 90 రోజుల్లోనే కోట్ల మంది ఆదరణ పొందింది. వ్యవస్థపై ఉన్న తీవ్ర అసంతృప్తి, మార్పు కోసం ఎదురుచూస్తున్న యువత, మధ్యతరగతి ప్రజలు ఈ ఉద్యమాన్ని తమ సొంత పోరాటంగా భావించారు. ప్రతి ఒక్కరూ ఒక సభ్యుడిగా మారి సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని దీనిని దేశవ్యాప్తం చేశారు.

కాకపోతే.. రాజకీయాల్లో సవాళ్లు వేరుగా ఉంటాయి.ఒక ఉద్యమంగా విజయం సాధించడం వేరు, రాజకీయ పార్టీగా ఎన్నికల్లో గెలవడం వేరు. సీజేపీ రాజకీయ పార్టీగా ఎదగాలంటే కొన్ని సవాళ్లను దాటాల్సి ఉంటుంది. కేవలం డిజిటల్ వేదికలపైనే కాకుండా, గ్రామ స్థాయి నుండి బలమైన క్యాడర్, సమర్థవంతమైన నాయకత్వాన్ని నిర్మించుకోవాలి. కేవలం ఒక సమస్యపైనే కాకుండా విద్య, వైద్యం, ఆర్థిక వ్యవస్థ, విదేశాంగ విధానాలపై స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందు ఉంచాలి. అధికారంలో ఉన్న పార్టీల వ్యూహాలను, ఎన్నికల రాజకీయాల్లోని ఎత్తుగడలను తట్టుకుని నిలబడటగలగటం అలవరుచుకోవాలి.

కాకపోతే కాక్రోచ్ జనతా పార్టీ అనేది ప్రస్తుత రాజకీయ వ్యవస్థకు ఒక హెచ్చరిక. ఒక చిన్న వ్యాఖ్యతో మొదలైన ఈ ప్రస్థానం, రేపు దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చేసే స్థాయికి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రజాస్వామ్యంలో ఓటరు దేవుడే అంతిమ నిర్ణేత. ఈ ఉద్యమం గనుక తన ప్రజాదరణను ఓట్లుగా, స్థిరమైన రాజకీయ శక్తిగా మార్చుకోగలిగితే..రాబోయే రోజుల్లో కేంద్ర అధికార పీఠం పతనం కావడం లేదా తీవ్రమైన సవాలును ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది.

బొద్దింకలు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చునని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే చేసిన వ్యాఖ్య భారతదేశంలో అణగారిన, నిరుద్యోగ యువత గుండెల్లో రగులుతున్న ఆక్రోశానికి ప్రతీక. సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యను తమకు అనుకూలంగా మార్చుకుని, అవును.. మేము బొద్దింకలమే, కానీ ఈ కుళ్ళిన వ్యవస్థను ప్రక్షాళన చేసే శక్తి మాకుంది" అంటూ యువత ముందుకు రావడం దేశ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపింది. ఈ డిజిటల్ నిరసన ఉద్యమం రేపు గనుక పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా రూపాంతరం చెందితే, జాతీయ రాజకీయాల్లో రాబోయే పెను మార్పులపై ఒక అద్భుతమైన ముద్ర వేసే అవకాశముంది.కాక్రోచ్ జనతా పార్టీ కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, జాతీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తించే బలమైన, ప్రగతిశీల విప్లవాత్మక ఎజెండాతో దూసుకుపోతోంది. వీరి సిద్ధాంతాలు సాంప్రదాయ ఓటు బ్యాంక్ రాజకీయాలను పూర్తిగా తిరగరాసేలా ఉన్నాయి. ఒకవేళ రాజకీయ పార్టీగా అవతరించి అధికారంలోకి వస్తే మ్యానిఫెస్టోనే ప్రధాన ప్రభావం చూపే అవకాశముంది. అధికార దుర్వినియోగానికి అడ్డుకట్టగా పదవీ విరమణ తర్వాత చీఫ్ జస్టిస్‌లకు రాజ్యసభ సీట్లు ఇవ్వడాన్ని నిషేధించడం , నిజమైన మహిళా సాధికారతగా చట్ట సభల్లోను మంత్రి వర్గంలోను మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం. ఫిరాయింపుదారులపై ఉక్కుపాదం మోపే విధంగా పార్టీలు మారే ఎమ్మెల్యేలు, ఎంపీలపై 20 ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించడం. అంబానీ ఆదానీల మీడియా లైసెన్స్ లు రద్దు చేయడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో ఓటు తీసేస్తే సీఈసిని ఉపా కింద అరెస్ట్ చేయడం లాంటి సంచలన మ్యానిఫెస్టోపై ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. అణుబాంబు దాడిని సైతం తట్టుకుని నిలబడగల జీవి గా బొద్దింక ను సైతం ఉదహరిస్తారు. ఇప్పుడు భారత రాజకీయాల్లోనూ అదే వినాశకర నిరోధక శక్తి కలిగిన యువత కాక్రోచ్ జనతా పార్టీ గా ఏకమయ్యారు. అధికారంలో ఉన్నవారు సామాన్య పౌరులను, నిరుద్యోగులను కీటకాలుగా భావిస్తే.. అవే కీటకాలు తలచుకుంటే ఎంతటి సామ్రాజ్యాన్నైనా కూల్చగలవని ఈ ఉద్యమం నిరూపించింది. సాంప్రదాయ రాజకీయాల అవినీతి కుళ్లు లోంచే ఈ బొద్దింకల విప్లవం పుట్టుకొచ్చింది. ఇన్నాళ్లూ ఎన్నికలను డబ్బు, కండబలంతో శాసించిన జాతీయ పార్టీలకు.. ఇప్పుడు సామాన్యుడి డిజిటల్ ఆయుధం, వినూత్న మ్యానిఫెస్టో అతి పెద్ద సవాల్‌గా నిలవబోతున్నాయి. పాలకులు తమ పద్ధతి మార్చుకోకపోతే బొద్దింకలు కేంద్ర పీఠాన్ని కదిలించడం ఎంతసేపు అనే నినాదం రేపటి భారత రాజకీయ యవనికపై నిజం అయ్యే ఛాన్సు కూడా లేకపోలేదు.




**గూడూరు**
**సత్యనారాయణ రావు, జర్నలిస్ట్**





# శిధిలావస్థలో జమ్మిగడ్డ పీహెచ్ సీ

- రోగులకు తీవ్ర ఇబ్బందులు
- ఒకవైపు సిబ్బంది కొరత, మరోవైపు మందుల లేమి



**కుషాయిగూడ, మహా :** జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిధిలావస్థకు చేరడంతో చికిత్స కోసం వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ముఖ్యంగా ఆరోగ్య కేంద్రంలోని టాయిలెట్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురై అపరిశుభ్రంగా ఉండటంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గు రవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రభుత్వం కళ్ళు తెరవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల కు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఈ స్థితిలో ఉండటం బాధాకరమని వారు పేర్కొన్నారు. భవనం పలు చోట్ల దెబ్బతిన డంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ కూడా సరిగా లేకపోవడం వల్ల రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆరోగ్య కేంద్రం ఇలా శిధిలావస్థలో ఉంటే ప్రజలకు ఎలాంటి సేవలు అందుతాయి?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి భవనానికి అవసరమైన మరమ్మతులు చేప ట్టడంతో పాటు టాయిలెట్లను శుభ్రపరచి, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పిం చాలని వారు డిమాండ్ చేశారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందేలా అధికారులు తక్షణ చర్యలు తీసు కోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటే రోగులు జంకుతు న్నారు ఒకవైపు సిబ్బంది కొరత మరోవైపు మందుల కొరత మరోవైపు ఆ పరిశుభ్రత వల్ల రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి రాలేకపోతున్నారు ఎన్నోసార్లు రోగులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభు త్వ ఆసుపత్రులపై ప్రత్యేక చొరవ చూపి మరింత మె రుగుపరచాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కాంగ్రెస్ ప్రజాపాలన లో అభివృద్ధికే పెద్ద పీట

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1.12 కోట్ల తో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**హన్మకొండ, మహా ;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 31వ డివిజన్ శాయంపేట చౌరస్తా తో పాటు వాసవి కాలనీలో సుమారు రూ.1.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల ను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ప్రజాపా లనలో పట్టణం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలు ఆలోచించాలని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను గత పరిస్థితులతో పోల్చి బేరీజు వేసుకోవా లని సూచించారు. గతంలో పట్టణ ప్రాంతాల్లో కూడా అనేక కాలనీలు గ్రామీణ వాతావరణాన్ని తలపించే పరిస్థితుల్లో ఉండేవని, రోడ్లు లేక, డ్రైనేజీలు లేక, ప్రాథ మిక సౌకర్యాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని ప్రతి గల్లీకి, ప్రతి కాలనీకి తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నా మని తెలిపారు. స్లమ్ ఏరియాలు, ఎస్సీ కాలనీలు, వెనుక బడిన ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనకు ప్రా ధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా కాజీపేట, సోమిడి, గోపాలపురం, శాయంపేట, దీన్‌దయాళ్ నగర్, సమ్మయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీల తో పాటు ఇతర మౌలిక వసతుల అభి వృద్ధి పనులు విస్తృతంగా జరుగు తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగ స్వాములు కావాలని, రాజకీయాలకు అతీతంగా పట్టణా భివృద్ధికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, అధి కారులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు, పాల్గొన్నారు.



# రైతులు విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

- గుర్తింపు పొందిన సంస్థల విత్తనాలనే వినియోగించాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, బ్యూరో మహా;** ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబ డులు సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. సోమవారం నల్లబెల్లి మండలం మే డపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రా రంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాల స్టాళ్లను సందర్శించి, వాటి నాణ్యత, అందుబాటు, వినియోగం పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రైతులు గుర్తింపు పొందిన సంస్థల ద్వారా సరఫరా చేసే ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, వి త్తనాల సంచులపై ఉన్న వివరాలను పరిశీలించిన తర్వాతే వినియోగించాలని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్త నాల వినియోగం, పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని, రైతులు ప్రభుత్వ సూచనల ను పాటించి శాస్త్రీయ విధానంలో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివా స్ రావు,నల్లబెల్లి ఏ.ఓ, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్
- రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** జిల్లాలోని ప్రభుత్వ ఆసు పత్రుల్లో ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు వైద్య సిబ్బంది బా ధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన ఈ మేరకు అధికారులకు పలు సూచనలు చేశారు.

తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి పరిశుభ్రత పారిశుద్ధ్య నిర్వహణ రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణ వార్డులు మరుగుదొడ్లు పరిశుభ్రం గా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని రోగులు ఆసుపత్రికి వచ్చిన నాటి నుంచే ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్య సేవలు అందించాలని వైద్యాధికా రులను ఆదేశించారు.

అనంతరం వైద్యాధికారితో మాట్లాడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదవుతున్న ఓపీ వివరాలు రోజువారీ రోగుల సంఖ్య గత పది రోజులుగా నమోదైన జ్వర కేసుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జ్వరాలపై ప్రత్యేక అప్రమత్త తతో వ్యవహరించాలని జ్వర లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించి తక్షణమే చికిత్స అందించాలని సూచించారు. గ్రామాల్లో జ్వరాల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు.రక్త పరీక్షల విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ మలేరియా డెంగ్యూ హెచ్ఐవీ నిర్ధారణకు అవసరమైన టెస్టింగ్ కిట్ల లభ్యత, నిర్వహిస్తున్న రక్త పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. ప్రయోగశాల లో అవసరమైన అన్ని పరీక్షా సామగ్రి అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీ లించి వైద్యులు సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని తనిఖీ చేశారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మందుల నిల్వ గదిని సందర్శించిన జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉన్న మందుల నిల్వలు వాటి గడువు తేదీలు అవసరమైన మందుల లభ్యతను పరిశీలిం చారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తుగా ఇండెంట్లు పంపించి అవసరమైన మందులను నిల్వ ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా పాము కాటుకు గురైన బాధితులకు అత్యవసరంగా వినియోగించే యాంటీ స్నేక్ ఇంజక్ష న్లు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్ క్లి నిక్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు నిల్వలో ఉన్న ఆయుష్ ఔషధాలను పరిశీలించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను కూడా సమర్థవంతంగా అం దించాలని సూచించారు.

తనిఖీ అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అం దుతున్న వైద్య సేవలు మందుల లభ్యత వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగుల అభిప్రాయాలను తెలుసుకొని వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యాధికారులకు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అవసరమైన మందులు పరీక్షా సదుపా యాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించా రు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట లక్ష్మీదేవి పల్లి తాసి ల్దార్ శిరీష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్యులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాలు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ మహా;** హనుమకొండ నగరంలో ని రంగంపేట వద్ద ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం ఆకస్మికంగా సందర్శిం ి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సూపర్ బజార్‌లో వినియోగదారుల కు అందిస్తున్న సేవలు, సరుకుల లభ్యత, నిర్వహణ వి ధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ పనితీరును తనిఖీ చేసి, ఇంధన విక్రయాలు, నిర్వహణ, సిబ్బంది విధులు, రోజువారీ లావాదేవీల వివరాలను అడిగి తెలు సుకున్నారు. అదేవిధంగా సూపర్ బజార్‌లోని టెక్స్‌టై ల్స్ విభాగాన్ని పరిశీలించి, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరలు తదితర ఉత్పత్తుల నాణ్యత, విక్రయాలు, నిల్వల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా, ఎలాంటి ఇబ్బందు లు లేకుండా కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసు కొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయా లని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా సహకార అధికారి బి. మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి, ఆడిట్ అధికారి కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలపై కఠిన చర్యలు

**సమాచారం అందిస్తే రూ.50 వేల ప్రోత్సాహకం**

**హనుమకొండ, మహా:** జిల్లాలో లింగ వివక్షత నిర్మూలనతో పాటు లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం (పీసీ-పీఎన్‌డీటీ)ను కఠినంగా అమలు చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. అప్పయ్య తెలిపారు. జిల్లా కలెక్టరే ట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో నిర్వ హించిన జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమా వేశంలో బాలికల నిష్పత్తి తగ్గుదల, స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణ, డెకాయ్ ఆపరేషన్ల నిర్వ హణ తదితర అంశాలపై సభ్యులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న మూడు స్కానింగ్ యంత్రాలను ఇప్పటికే సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎక్కడైనా మొబైల్ స్కానింగ్ కేంద్రాలు లేదా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు పక్కా సమాచారం ఉంటే 6300030940 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. వి శ్వసనీయ సమాచారం అందించే వారికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు రూ.50 వేల ప్రోత్సాహకం అందజేస్తా మని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇప్పటికే ఒకరు లేదా ఇద్దరు ఆడపిల్లలు ఉన్న కుటుంబాల్లో అవగాహన కల్పించి, ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎంటీపీ చట్టం ప్రకారం గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో మాత్రమే ప్రత్యేక పరిస్థితుల్లో గర్భస్రావానికి అనుమతి ఉంటుందని, పుట్టబోయే శిశువు ఆడపిల్ల అని తెలుసుకుని గర్భస్రావానికి పాల్పడటం శిక్షార్హమని హెచ్చరించారు. అలాగే నాటు వైద్యం, అర్హతలేని వ్యక్తుల వద్ద చికిత్స చేయించుకోవడం ప్రాణాలకు ప్ర మాదకరమని సూచించారు.సమావేశంలో జీఎంహెచ్ గైనకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రజిత, డాక్టర్ కవిత, డాక్టర్ రూబీన, లక్ష్యం స్వచ్ఛంద సంస్థ సీఈవో తాళ్లూరి లత, డాన్ బోస్కో సంస్థ ప్ర తినిధులు, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 19 సంవత్సరాలుగా జరగని న్యాయం

**స్థలాలు కేటాయించే వరకు జరిగేది లేదు యువజన సంఘాల అధ్యక్షులు**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలి టీ హిమాయత్ నగర్ లోని సర్వే నంబరు 151 లో 290 మంది పేదలకు 60 గజాల స్థలాల పట్టాలు ఇచ్చి 19 సంవత్సరాలు గడిచిన నేటి వరకు స్థలాలు చూపించకపోవడం తో హిమాయత్ నగర్ గ్రామానికి చెందిన నాలుగు యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష నెల రోజులు గడిచిన అధికారులు స్పందించడం లేదంటూ భవిష్యత్తులో దీక్షను మరింత ఉధృతం చే స్తామని తెలిపారు. మా స్థలాలు మాకు కేటాయించే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదంటూ గ్రామస్తులు తెలిపారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఆనాటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి తన చేతుల మీదుగా ఇచ్చిన 60 గజాల పట్టాలుకు నేటికీ స్థలలు చూపించడం లేదని అధికారులు, రాజకీయ నాయకుల, చుట్టూ ఎన్నిసార్లు తిరిగిన వారు ఇప్పి స్తాం, చేస్తాం అనే మాట తప్ప మీ స్థలాలు మీకు కేటాయిస్తామని గట్టి హామీ ఇవ్వడం లేదని గ్రామ స్తులు తెలిపారు. 19 సంవత్సరాలుగా మా స్థలాలు మాకు కేటాయిస్తారని ఆశతో వేచి చూస్తున్నా లబ్ధి దారులు మాకు న్యాయం జరిగేంతవరకు 60 గజాల స్థలాల నుండి కదిలేది లేదని తెలిపారు. 19 సంవత్సరాలుగా గ్రామస్తులకు అన్యాయం జరుగు తుందని గ్రామస్తులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని యువజన సంఘాల అధ్యక్షులు తెలిపారు. హిమాయత్ నగర్ గ్రామ వృద్ధులు మహిళలు యువకులు రోడ్డు పై కూర్చుంటే రాజకీయ నాయకులు ఇపుడు ప్రజలకు అండగా ఉండకుంటే ఇంకా దేని కోసం మీరు అని గ్రామ స్థులు ప్రశ్నిస్తునారు. పార్టీ జెండాలను పక్కనపెట్టి గ్రామం కోసం ఐక్యంగా ఉండి అందరూ కలిసిక ట్టుగా పోరాడాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

గత 19 సంవత్సరాలుగా 60 గజాల స్థలాలు కే టాయించకపోవడంతో గ్రామస్తులంతా ఏకమై మా 60 గజాల స్థలాలు మాకు కేటాయించే అం తవరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని. నెల రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు అధి కారులు సానుకూలంగా స్పందించి మా స్థలాలు మాకు ఇచ్చేంత వరకు ఇక్కడ నుండి కదిలేదు లేదని తెలిపారు. గ్రామ రాజకీయ నాయకులు తమ రాజకీయాలను పక్కన పెట్టి గ్రామ ప్రజలకో సం ఐక్యంగా ముందుకు రావాలని కోరుకుంటున్న కుమ్మరి విట్టల్.

**శాంతి యువజన సంఘం అధ్యక్షులు**

గత 19 సంవత్సరాలుగా గ్రామ రాజకీయ నా యకులను నమ్మి గ్రామ ప్రజలు మోసపోయారని 19 సంవత్సరాలుగా మీకు మీ స్థలాలు ఇస్తామని తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మోసం చేశారని కేవలం ఓట్ల కోసం 60 గజాల స్థలాలను ముందు పెట్టుకొని రాజకీయాలు చేశారు. ఇప్పటి కైనా గ్రామ రాజకీయ నాయకులు తమ పార్టీలను పక్కనపెట్టి గ్రామం కోసం గ్రామ ప్రజల కోసం ముందుండి గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని కోరుకుంటున్నా.

**కట్టమీద శ్రీను.**
**అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు**

గత నెల రోజుల నుండి వర్షాన్ని సైతం లెక్కచే యకుండా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షకు వృద్ధులు మహిళలు యువకులు పెద్దయెత్తున పాల్గొంటున్నారు. ప్రభుత్వం ఆలోచించి మ స్థలాలు మాకు చూపించాలని ప్రభుత్వాన్ని కో రుకుంటున్నా పట్టాలు ఇచ్చి 19 సంవత్సరాలు గడిచిన నేటి వరకు మాకు స్థలాలు చూపించ కపోవడంతో రిలే నిరాహార దీక్ష చేస్తున్నాము ఇప్పటికైనా అధికారులు మా స్థలాలు మాకు కేటాయించాలి లేకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

**కొర్ర గోపాల్ నాయక్**
**సేవాలాల్ యువజన సంఘం అధ్యక్షులు**

60 గజాల స్థలాల కోసం ఎంతోమంది పేద ప్రజలు ఎదురుచూస్తున్నారు గతంలో పట్టాలు ఇచ్చే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనే ఉంది నేడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోనే ఉంది ప్రభుత్వం నిరుపేదల కోసం ఆలోచించి వెంటనే 60 గజాల స్థలాలు కేటాయించాలని కో రుకుంటున్నా. నెల రోజులుగా రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న అధికారులు కనికరించడం లేదంటూ మా బాధ ఇప్పటికైనా అర్థం చేసుకొని మా స్థలాలు మాకు కేటాయించాలని వేడుకుంటున్నాను.

**మహమ్మద్ కరీం.**
**మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యువజన సంఘం అధ్యక్షులు**



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు

**వరంగల్, మహా;** తెలంగాణ రాష్ట్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారు చేసినట్లు తెలిసింది. అర్హులైన రేషన్ కార్డుదా రులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1.05 కోట్లకు పైగా కుటుంబాలకు క్యూ ఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధమైనట్లు తెలుస్తోం ది. హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమం లో సీఎం చేతుల మీదుగా ఈ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ పంపిణీ కార్యక్రమాన్ని వచ్చే నెల మొదటి వారంలో లేదా ఆగస్టు 15న ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబు తున్నాయి. కాగా ఈ స్మార్ట్ కార్డుల పై కేవలం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలను మాత్రమే ముద్రించడం జరి గిందని దీనిపై తెలంగాణ బిజెపి ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారానికి ఆదేశం

**వరంగల్, మహా:** గ్రీవెన్స్‌లో స్వీకరించిన ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాల ని జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం ని ర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి మొత్తం 104 ఫిర్యాదులు స్వీ కరించి సంబంధిత శాఖలకు పంపించారు. వీటిలో టౌన్ ప్లానింగ్ 36, ఇంజనీరింగ్ 37, రెవెన్యూ 8, హెల్త్ & శానిటేషన్ 10, నీటి సరఫరా 13 దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి సకాలంలో పరిష్కారం చూపాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతికి సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించడంతోపాటు వినతులపై నిరంతర పర్యవేక్షణతో ఫలితాలు సాధించాలని తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసే విశ్వసనీయ వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్దేశిత గడువులో పరిష్కరించేలా సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అధికారి బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని మిగిలిన వినతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చిత్తశుద్ధితో పని చేయాలని ఆదేశించారు. ప్రజలు తమ వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థుల సంఘటిత పోరాటం చారిత్రాత్మక విజయం

- అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్
- అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘనంగా నివాళి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఢిల్లీలో విద్యార్థుల సంఘటిత పోరాటానికి చారిత్రాత్మక విజయం సిద్ధించిందనిభారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ పై విద్యార్థి వీరులు గర్జించిన సింహాల్ల విజృంభించి ఉద్యమంలో కొందరు విద్యార్థి వీరులు అమరులు కావడం అత్యంత బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా సిగ్గు విడిచి కళ్ళు తెరిచి అమరులైన విద్యార్థి వీరుల కుటుంబాలను ఆదుకోవడంతోపాటుగా ప్రతి ఒక్క కుటుంబానికి ఒక ఉద్యోగం కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ, అమరులైన విద్యార్థి వీరులకు సంతాపంగా కొవ్వొత్తులతో కొత్తగూడెం అంబేద్కర్ సెంటర్( హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్) వద్ద ఉన్న భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు సోమవారం మద్దెల బృందంతో పాటు పలువురు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య డాక్టర్ మద్దెల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అలసత్వం నిర్లక్ష్యం అవినీతి అక్రమాలతో అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ పేపర్ ను లీక్ చేయించిందని ఇది ఒక చారిత్రాత్మక తప్పిదం అని మండిపడ్డారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన కొందరి ఉన్నత స్థాయి అధికారులను కూడా డిస్మిస్ చేయడం, ఉన్నత స్థాయి దర్యాప్తు సంస్థను నియమించడం ఇది విద్యార్థి శక్తి యువ శక్తి యొక్క ఘనవిజయమని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి ,సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సంఘ ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండా రమేష్, సంఘం రాష్ట్ర మరొక ఉపాధ్యక్షులు వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పి.సురేందర్, సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి భూపతి అశోక్, సంఘ జిల్లా నాయకులు మచ్చ పృథ్వీరాజ్, రాజేశ్వరరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## 16వ డివిజన్లో ప్రారంభమైన బాల భరోసా

**కార్పొరేటర్ మునిగడప పద్మ**

**కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలిముద్ద బాల భరోసా కార్యక్రమం సోమవారం ఘనంగా ప్రారంభమైంది.15,18,19 అంగన్వాడీ సెంటర్లలో తొలిముద్ద బాల భరోసా కార్యక్రమాన్ని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ చిన్నారులకు తొలిముద్దను వడ్డించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉండకుండా వారి ఎదుగుదలలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్లలోని చిన్నపిల్లలకు గోధుమ రవ్వలో అన్ని రకాల పప్పులు పల్లీలు మొదలైన ప్రోటీన్ ఆహారాన్ని అందించాలని ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఆమె తెలిపారు. పిల్లలకి అందించే పౌష్టికాహారంలో కాంట్రాక్టర్ నాణ్యత లోపం లేకుండా ముడి పదార్థాన్ని అందించాలని ఆ బాధ్యతను అంగన్వాడీ టీచర్స్ అంగన్వాడీ సూపర్వైజర్లు ఉన్నత అధికారులు చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో 15, 18, 19 సెంటర్ల టీచర్లు ఎన్ సరోజ, నీలవేణి, షహనాజ్ బేగం, ఆయమ్మ వెంకటలక్ష్మి చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

- గాంధీ పథం కన్వీనర్ చింతలచెరువు గెరీషం
- విద్యానగర్లో అబ్దుల్ కలాం వర్ధంతి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని గాంధీ పథం కన్వీనర్ చింతలచెరువు గెరీషం అన్నారు. విద్యానగర్ కాలనీలోని సోమవారం గాంధీ పతం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గెరీషం మాట్లాడుతూ యువతకు అబ్దుల్ కలాం అనేక మంచి మంచి సందేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అబ్దుల్ కలాంను విద్యార్థిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండలో ఎంఈఓ కార్యాలయం ముందు సిపిఎం ధర్నా

**వలిగొండ జులై 27 మహా న్యూస్** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం వలిగొండ ఎంఈఓ ఆఫీస్ ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా నాయకులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు అవుతున్నప్పటికీ నేటికీ విద్యార్థులకు యూనిఫాం అందలేదని పలు సమస్యలతో కూడిన వినతి పత్రం ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ సువర్ణకు అందజేశారు





## ప్రజావాణికి 114 అర్జీలు

**యాదాద్రి భువనగిరి జులై 27 మహా** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 134 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 64, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 17, సర్వే ల్యాండ్స్ 8, మున్సిపాలిటీ 8,డి.పి. ఓ 6, మైనింగ్ 4, ఉపాధి కల్పన 3, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య 2,ఇరిగేషన్ 2,జిల్లా పరిషత్2, వ్యవసాయ 2,విద్య శాఖ 2, సివిల్ సప్లై,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్యుత్,ఎల్.డి. ఎం, డి. సి. ఓ, ఆర్టీసీ,హౌసింగ్, చేనేత మరియు జౌళి,కోపరేటివ్,పౌర సంబంధాలు,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ స్టేట్ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరికి బదులు ప్రత్యామ్నాయ (తక్కువ నీటి) పంటలు వేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ నెల 28వ తేదీ నుంచి జిల్లాలోని అన్నిరైతు వేదికల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎల్ ని నో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సాగునీటి వినియోగం తదితర అంశాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల స్పెషల్ అధికారులకు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సభ

**ఆలేరు జూలై 27 మహా** : భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం 11వ వర్ధంతి సభ సోమవారం రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అబ్దుల్ కలాం భారతదేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు కలలు కనండి కలలను సాకారం చేసుకోండి అనే నినాదాన్ని విద్యార్థులకు తెలియజేసిన మహా మేధావి అని అన్నారు ముందుగా ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా రాఘవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణకు భూమి పూజ నిర్వహించడం జరిగింది అబ్దుల్ కలాం జయంతి అక్టోబర్ 10 నాటికి విగ్రహావిష్కరణ పూర్తి చేస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మంగ నరసింహులు, పులి పలుపుల మహేష్, 3వ వార్డు కౌన్సిలర్ యాట శివ 4వ వార్డ్ కౌన్సిలర్ బీజని కళ్యాణి మధు, మాజీ వార్డు మెంబర్లు పంతం కృష్ణ, జింకల రామకృష్ణ, మోతే వెంకటేష్, మాజీ ఎంపిటిసి కట్టే గుమ్మల సాగర్ రెడ్డి, జర్నలిస్టులు ఎండి కుర్షద్ పాషా, ఎర్ర జాన్సన్ వివిధ ప్రజా సంఘాల నాయకులు కంతుల శంకర్, ఏలుగుల వెంకటేష్,ఎండి ఫయజ్, పడగంటి చందు, మైదము భాస్కర్, పేరపు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలలో విస్తృతంగా మొక్కలు నాటాలి

- సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి
- ప్రత్యేక అధికారి జగన్నాథరావు
- ఎంపీడీవో జలంధర్ రెడ్డి

**వలిగొండ జులై 27 మహా న్యూస్** గ్రామాలలో విస్తృతంగా మొక్కలు నాటాలని వాటిని సంరక్షించడానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని మంగళవారం ప్రత్యేక అధికారి జగన్నాథ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ఇండ్ల పురోగతి జలసిరి వన మహోత్సవం కార్యక్రమాలాపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ వై ప్రేమలత వ్యవసాయశాఖ అధికారి శృతి పంచాయతీ రాజు సహాయ ఇంజనీర్ సందీప్ రెడ్డి ఏపీవో పరశురాములు ఏపీ అంజయ్య విక్రం కిరణ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



## మణుగూరు సింగరేణి చెక్‌పోస్ట్ వద్ద రక్షణ చర్యలు చేపట్టాలి..

- వర్షా కాలంలో ప్రమాదకరంగా మారిన రహదారి...
- యాజమాన్యం వెంటనే స్పందించాలి..
- : ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ రామనరసయ్య

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలోని సింగరేణి చెక్‌పోస్ట్ వద్ద కార్మికులు, వాహనదారుల భద్రతకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం రామనరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి చెక్‌పోస్ట్ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అండర్‌బ్రిడ్జి సమీపంలోని చెక్‌పోస్ట్ వద్ద రహదారిపై వర్షాకాలంలో, వాటర్ స్ప్రే చేసిన సమయంలో రోడ్డు జారుడుగా మారి మోటార్‌సైకిళ్లపై ప్రయాణించే కార్మికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రమాదాలు జరగకముందే యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చెక్‌పోస్ట్ భవనం సీలింగ్ పూర్తిగా దెబ్బతిన్న కారణంగా దుమ్ము అధికంగా లోపలికి వస్తోందని, విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు కారుతుండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. చెక్‌పోస్ట్ భవనాన్ని పటిష్టపరచడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది కోసం ఎయిర్ కండిషనర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి షిఫ్టులో 100 నుంచి 175 వరకు బొగ్గు లారీలు ఈ చెక్‌పోస్ట్ గుండా రాకపోకలు సాగిస్తున్నాయని, వాటితో పాటు కంపెనీ వాహనాలు, కార్మికుల వ్యక్తిగత వాహనాలు కూడా ఇదే మార్గాన్ని వినియోగిస్తున్నాయని తెలిపారు. దీంతో ఈ ప్రాంతం ప్రమాదకర జోన్‌గా మారిందని, కార్మికులు, వాహనదారుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ యాజమాన్యం అత్యవసర రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పర్యవేక్షణ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం. రామ నరసయ్యతో పాటు జీఎం కమిటీ సభ్యుడు ఆవుల నాగరాజు, ఆఫీస్ బేరర్ అదేర్ల సురేందర్, పిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం..

- బీసీ హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రహరీ గోడలు..
- కట్టంవారిగూడెంలో అంగన్వాడి భవనం ప్రారంభం..
- రూ.42 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..

**మణుగూరు/అశ్వాపురం, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో విద్యా, సంక్షేమ రంగాలకు సంబంధించిన రూ.42 లక్షల అభివృద్ధి పనులకు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం శ్రీకారం చుట్టారు. అశ్వాపురం బీసీ హాస్టల్‌లో రూ.15 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.15 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. అలాగే చింతిర్యాల గ్రామపంచాయతీ పరిధిలోని కట్టంవారిగూడెంలో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. బీసీ హాస్టల్, జూనియర్ కళాశాలలకు నిర్మించే ప్రహరీ గోడలతో భద్రత మరింత మెరుగుపడుతుందని, పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. Ppకట్టంవారిగూడెంలో అంగన్వాడి భవనాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక విద్య, పోషకాహారం, సురక్షితమైన వాతావరణం అందించడంలో అంగన్వాడి కేంద్రాల పాత్ర కీలకమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. చదువులు, కళాశాలలోని సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అశ్వాపురం మండలానికి చెందిన ఆశా వర్కర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వినతిపత్రం సమర్పించారు. వారి సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కళాశాల అధ్యాపకులు, హాస్టల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, ఆశా వర్కర్లు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సుజాతనగర్ అభివృద్ధికి నిరంతర కృషి

- - కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు
- - రూ.1.95కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కార్పొరేషన్ పరిధిలోని గ్రామాల రూపురేఖలు మార్చేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల పరిధిలోని కార్పొరేషన్ డివిజన్‌లో రూ.1.95 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీలు మరుగుదొడ్లు బస్ షెల్టర్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుజాతనగర్ కార్పొరేషన్ ప్రాంతంగా మారిన తర్వాత మౌలిక సదుపాయాల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించామని చెప్పారు. ప్రతీ గ్రామంలో తాగునీరు వీధిదీపాలు డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సుజాతనగర్ నుండి శివాలయం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు అందుబాటులోకి తెచ్చామన్నారు. సుజాతనగర్‌లో మున్సిపల్ సబ్ డివిజన్ కార్యాలయ ఏర్పాటుతో పాటు సింగభూపాలెం చెరువుకట్ట అభివృద్ధి కోసం రూ.5.5 కోట్లు మంజూరు కానున్నట్లు వెల్లడించారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ (న్యాక్) కేంద్రం మంజూరైందని అదేవిధంగా నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ ప్రగతికి అవసరమైన నిధుల కోసం నిరంతరం కృషి చేస్తున్నామని ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సొసైటీ అధ్యక్షులు మండే హనుమంతరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు, మున్సిపల్ కమిషనర్ సుజాత, కార్పొరేటర్ చింతల పూడి శ్రావణి, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ భారతి, ఏఓ నర్మద, విద్యుత్ శాఖ ఏఈ కిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు, మండల నాయకులు వీర్ల మల్లేష్, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, కొమారి కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## బంగారు మంగళసూత్రం చోరీ చేసిన
# ఇద్దరు నిందితుల అరెస్ట్

**యాదాద్రి భువనగిరి జులై 27 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, భువనగిరి డివిజన్ డీఎస్పీ బి. రవీందర్ పర్యవేక్షణలో బీబీనగర్ పోలీసులు చైన్ స్నాచింగ్ కేసును విజయవంతంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. బీబీనగర్ పోలీస్ స్టేషన్ క్రైం నెం. 241/2026, సెక్షన్ 304(2) బీఎన్ఎస్ కేసు వివరాల ప్రకారం, 2026 జూలై 12న బీబీనగర్‌కు చెందిన కుక్కడువు అందాలు (65) తన భర్తతో కలిసి ఇంటి వద్ద ఉండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తమను ప్రభుత్వ ప్రతినిధులుగా పరిచయం చేసుకుని, "ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం పథకానికి సంబంధించిన ఫోటోను అప్లోడ్ చేయాల్సి ఉంది" అంటూ నమ్మించారు. ఫోటో తీసేందుకు మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని తొలగించాలని చెప్పడంతో బాధితురాలు దానిని తీసి తన భర్తకు ఇచ్చింది. అదే సమయంలో నిందితులు బాధితురాలిని తోసివేసి, ఆమె భర్త చేతిలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని అపహరించి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన బీబీనగర్ పోలీసులు, విశ్వసనీయ సమాచారం మేరకు 2026 జూలై 26న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నిందితులు సింహాద్రి గంగాధరప్ప (22), జంగాల శివరాజ్ (38) ఇద్దరు నిందితుల వద్ద నుంచి అపహరించిన బంగారు మంగళసూత్రాన్నిస్వాధీనం చేసుకున్నారు వారి వద్ద నుండి ఎన్ఎస్-200 పల్సర్ మోటార్ సైకిల్, ఐఫోన్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమైండ్ కుతరలించారు. నిందితులు ప్రధానంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని, ప్రభుత్వ ఉచిత బియ్యం, పెన్షన్, కేవైసీ లేదా ఇతర సంక్షేమ పథకాల పేరుతో నమ్మకం కల్పించి, ఫోటో తీసేందుకు బంగారు గొలుసు లేదా మంగళసూత్రం తీసేయాలని చెప్పి, ఆభరణాలను అపహరించి పరారయ్యేవారని దర్యాప్తులో వెల్లడైంది. అలాగే, నిందితులపై ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో బీబీనగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ ఎన్. రమేష్, హెడ్ కానిస్టేబుల్ బి. అంజయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు పి. శ్రీనివాస్, జి. జనార్ధన్ భువనగిరి పోలీస్ స్టేషన్ పోలీసులు ఉన్నారు.

# ఈ-సిటీ మహేశ్వరం పారిశ్రామిక పార్కును సందర్శించిన సీఎస్


**పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం ఉంటుంది**

**రాష్ట్ర సి.ఎస్ సంజయ జాజు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఈసిటీలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ను, ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమ, మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, ఎం/ఎస్. చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం సందర్శించారు. సి.ఎస్ తో పాటు టి.జి.ఐ.ఐ.సి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశాంకతో పాటు సీనియర్ ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ముందుగా, మెసర్స్ ప్రీమియర్ ఎనర్జీస్ ఫోటోవోల్టాయిక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈసిటీలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ సంస్థ సోలార్ పీవీ మాడ్యూల్స్ తయారీచేస్తోంది. రూ.1,240 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో ప్రస్తుతం 1,200 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. అనంతరం ఎం/ఎస్. అవాంటెల్ లిమిటెడ్ పరిశ్రమను సీ.ఎస్ సందర్శించారు. ఈ సంస్థ 4 ఎకరాల విస్తీర్ణంలో ఈసిటీలో ఉన్న ఈ పరిశ్రమ హైటెక్ రక్షణ ఎలక్ట్రానిక్స్, శాటిలైట్ పేలోడ్ వ్యవస్థలు, గ్రౌండ్ స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రధానంగా చేపడుతోంది. రూ.59.22 కోట్ల పెట్టుబడితో ఉన్న ఈ సంస్థలో 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ సందర్భంగా మంఖాల్ పారిశ్రామిక పార్క్ ను సందర్శించి, మెసర్స్ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ పరిశ్రమను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందర్శించారు. ఈ సంస్థకు ప్రారంభంలో 1,20,881 చదరపు మీటర్లు (29.87 ఎకరాలు) విస్తీర్ణం గల భూమి బీఓపీపీ/బీఓపీఈటీ ఫిల్మ్ తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఇందులో కోటింగ్, మెటలైజింగ్, స్లిట్టింగ్ మరియు రీసైక్లింగ్ ఉత్పత్తులు జరుగుతాయి. కాగా తమకు కేటాయించిన స్థలంలో ఈ చిరిపాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ సంస్థ తన తయారీ యూనిట్ ను విజయవంతంగా నెలకొల్పి, ప్రాజెక్టుతో పాటు విస్తరణ ప్రాజెక్టును కూడా పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ రూ.284.02 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పిస్తోంది. మహేశ్వరం జనరల్ పార్క్ లోని మెసర్స్ విప్రో ఎంటర్‌ప్రైజెస్ (ప్రైవేట్) లిమిటెడ్ పరిశ్రమను సందర్శించారు. ఈ సంస్థకు 1,21,410 చదరపు మీటర్లు (30 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి కేటాయించారు. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.17,434 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 331 మందికి ఉపాధి కల్పిస్తోంది. చివరిగా ఎం/ఎస్. మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ను సంజయ్ జాజు సందర్శించారు. ఈ సంస్థకు మహేశ్వరం జనరల్ పార్క్‌లోని మొత్తం 14,973 చదరపు మీటర్లు (3.7 ఎకరాలు) విస్తీర్ణంలో భూమి అత్యాధునిక రత్నాలు, ఆభరణాల తయారీ యూనిట్ స్థాపన కోసం కేటాయించారు. ఈ సంస్థకు కేటాయించిన స్థలంలో తయారీ యూనిట్ ను విజయవంతంగా ఏర్పాటు చేసి విస్తరణ ప్రాజెక్టులను పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ యూనిట్ రూ.37,405 లక్షల పెట్టుబడితో వాణిజ్య ఉత్పత్తి నిర్వహిస్తూ 2,782 మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి





అవకాశాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందిస్తూ, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి మరింత వేగం తీసుకురావాలనిసీ.ఎస్ సంజయ్ జాజు అధికారులను కోరారు.

## బుల్లెట్ ట్రైన్ సర్వే మార్చాలని వినతి


**చిన్న రైతులను కాపాడాలని ఎమ్మెల్యేకు గ్రామస్తుల విజ్ఞప్తి**

**రాజేంద్రనగర్, మహా:** బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం ప్రతిపాదించిన సర్వే లైన్‌ను మార్చి చిన్న, సన్నకారు రైతులను ఆదుకోవాలని శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం సుల్తాన్‌పల్లి సర్పంచ్ ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సుల్తాన్‌పల్లి, కేబీ దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతిపాదించిన సర్వే లైన్ ప్రకారం తమ వ్యవసాయ భూములు, నివాస గృహాలు ప్రభావితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే మార్గాన్ని మార్చి రైతుల భూములు, గ్రామాలను రక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, సిద్ధేశ్వర్, ఉపసర్పంచ్ దండు శివకుమార్, మల్లికార్జున్, రాజు గౌడ్, వెంకటేష్ ముదిరాజ్, కుమ్మరి కృష్ణ, శ్రీశైలం, మధు, శివకుమార్ గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



## మద్యం దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా వాటర్ బాటిళ్లు, గ్లాసుల విక్రయం?

**-ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తున్న కొందరు నిర్వాహకులు**



**క్యాతనపల్లి మహా :** మున్సిపాలిటీ పరిధిలోని పలు చోట్ల మద్యం దుకాణాల వద్ద ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాటర్ బాటిళ్లు, డిస్పోజబుల్ గ్లాసులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం విక్రయానికి మాత్రమే లైసెన్స్ పొందిన దుకాణాల్లో ఇతర వస్తువులను విక్రయించరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ, కొందరు నిర్వాహకులు వాటిని పట్టించుకోవడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. మద్యం కొనుగోలు చేసే వినియోగదారులకు అధిక ధరలకు వాటర్ బాటిళ్లు, గ్లాసులను విక్రయిస్తూ అదనపు లాభాలు ఆర్జిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ఇటువంటి ఉల్లంఘనలు కొనసాగుతున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మద్యం దుకాణాల్లో లైసెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా ఇతర వస్తువులను విక్రయించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. సంబంధిత అంశంపై ఫోన్ ద్వారా బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ ని సంప్రదించగా "ఈ విషయం ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. ఒకవేళ అలాంటి ఘటనలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా తనిఖీలు నిర్వహించి, అక్రమాలు ఉన్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని" స్పందించారు.



# అంగవైకల్యం అడ్డుకాలేదు

- **రాహుల్ పోలీస్ కావాలన్న కోరిక నెరవేరింది**

**కుషాయిగూడ, మహా:** పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న దమ్మాయిగూడకు చెందిన రాహుల్ చిరకాల కోరికను మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి నెరవేర్చారు. ఒకరోజైనా పోలీస్ అధికారిగా కుర్చీలో కూర్చోవాలని రాహుల్ కోరుకోవడంతో, కమిషనరేట్ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించిన సీపీ సుమతి తన కుర్చీలో రాహుల్‌ను కూర్చోబెట్టి పోలీస్ టోపీ ధరింపజేశారు. "నీ కోరిక తీరిందా రాహుల్?" అంటూ ఆప్యాయంగా పలకరించగా, ఆనందంతో చిరునవ్వులు చిందించిన రాహుల్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి వలస వచ్చిన తిరుమలరావు-రాధమ్మ దంపతుల కుమారుడు రాహుల్ పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. రెండు కాళ్లు ఉన్నప్పటికీ నడవలేని పరిస్థితి, మాటలు కూడా సరిగా మాట్లాడలేని స్థితిలో ఉండటంతో కుటుంబానికి భారంగా మారాడు.ఈ విషయాన్ని తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత దృష్టికి తీసుకెళ్లగా, రాహుల్‌కు వీల్ చైర్‌ను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, అంగవైకల్యంతో బాధపడుతున్న వారి పట్ల ప్రతి ఒక్కరూ దయ, ప్రేమ, ఆదరణ చూపాలని, స్వచ్ఛంద సంస్థలు మరింత ముందుకు వచ్చి వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.రాహుల్ కోరిక నెరవేరడంతో అతని తల్లిదండ్రులు, సీపీ సుమతి, ప్రతిమ ఫౌండేషన్ చైర్మన్ రష్మిత, మెరుగు శివకృష్ణలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.స్వచ్ఛంద సంస్థలు అంకితభావంతో పనిచేయాలన్న సుమతిస్వచ్ఛంద సంస్థలు పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోతారని నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందించాలని బడుగుల సుమతి స్వచ్ఛంద సంస్థల నేతలతో అన్నారు. స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలను వికలాంగులను అంగవైకల్యాకులను మూగ, చెవిటి వారిని ఆప్యాయంగా పలకరించి సోదర భావంతో మెదగాలని బడుగుల సుమతి కోరారు. స్వచ్ఛంద సంస్థలు సొసైటీలో ఎప్పటినుండో ప్రజలకు చేరువై ఎన్నో సేవ కార్యక్రమాలను చేయడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దామరపల్లి నర్సింహారెడ్డి, చింతల విజయ్ కుమార్, జినుక రఘు తదితరులు పాల్గొన్నార



# ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచన



**రాజేంద్రనగర్, మహా:** వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో మున్ని ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ శాఖల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.జల సంరక్షణ భవిష్యత్ తరాల అవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి చెరువు అనే లక్ష్యంతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పొలాల్లో ఫార్మ్‌పాండ్లు, ఊటకుంటలు ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని వినియోగించుకోవాలని కోరారు.'జలసిరి-వీబీజీ రాంజీ' కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, మండల స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ సభల ద్వారా పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీడీవో, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ అధికారులు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి మిగిలిన 30 శాతం ఫారాలను సేకరించాలని సూచించారు.సమావేశంలో గ్రామాల అభివృద్ధి, పెండింగ్ పనులు, మౌలిక వసతులు, ప్రజా సమస్యలపై సర్పంచులు అధికారులను ప్రశ్నించగా, సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలని ఎమ్మెల్యే సూచించారు.అయితే మండల స్థాయి సమావేశానికి కొంతమంది సర్పంచుల భర్తలు, కుటుంబ సభ్యులు హాజరుకావడంపై అధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశాలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరై ప్రోటోకాల్‌ను పాటించాలని పలుమార్లు సూచించినప్పటికీ ఆచరణలో మార్పు కనిపించడం లేదని పేర్కొన్నారు.సమావేశంలో ఎమ్మార్వో అమరలింగం గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి, ఎంపీడీవో రమేష్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ప్రజావాణితో సమస్యల సత్వర పరిష్కారం

- **జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**
- **జిల్లా ప్రజావాణికి 136 ఫిర్యాదులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-54, ఇతర శాఖలు 82 మొత్తం 136 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి , కిరణ్మయి జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 111 జీవో పరిధిలో అక్రమ వెంచర్‌పై చర్యలు

**రోడ్డు పనులు నిలిపివేసి కంకర తొలగింపు**



రాజేంద్రనగర్, మహా: శంషాబాద్ మండలంలోని 111 జీవో పరిధిలో అక్రమ వెంచర్ అభివృద్ధి పనులపై అధికారులు కొరడా ఝుళిపించారు. చౌదర్‌గూడ గ్రామంలోని గొల్లవాని చెరువు బఫర్‌జోన్‌లో అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సోమవారం డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రమేష్‌గౌడ్, గ్రామ కార్యదర్శితో కలిసి స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్లు 183, 185లో చేపట్టిన రోడ్డు పనులను వెంటనే నిలిపివేసి, వేసిన కంకరను తొలగింపజేశారు. గతంలో నోటీసులు జారీ చేసినప్పటికీ పనులు కొనసాగించడంపై డీఎల్‌పీవో సతీష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# హిమాయత్‌నగర్ 60 గజాల బాధితులకు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సంఘీభావం..

- **పేదలకు కేటాయించిన స్థలాల్లోనే ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో సర్వే నంబర్ 151లో 60 గజాల ఇళ్ల స్థలాల కోసం కొనసాగుతున్న బాధితుల రిలే దీక్షలకు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సోమవారం సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడిన ఆయన వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. 2007లో నిరుపేదలకు పంపిణీ చేసిన 60 గజాల ఇళ్ల స్థలాల్లోనే ఇళ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు కేటాయించిన భూమిలో గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయడం సమంజసం కాదని, పేదలు తమ హక్కు కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు స్థలాలు చూపించి ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరారు. హిమాయత్‌నగర్ ప్రజలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి వారి హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పల్లగోల్ల మలేష్ యాదవ్, యువజన సంఘాల అధ్యక్షులు కట్టమీది శ్రీను, కుమ్మరి విఠల్, కరీం భాయ్, కొత్ర గోపాల్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 60 గజాల బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

# బారికేడ్లతో బస్‌స్టాప్‌కు ముప్పు

**సర్వీసుల పునరుద్ధరణకు విజ్ఞప్తి**

**కుషాయిగూడ, మహా:** కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల కారణంగా బస్సుల రాకపోకలు నిలిచిపోతుండటంతో ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బారికేడ్ల కారణంగా ముషీరాబాద్ డిపోకు చెందిన 3కే బస్సులు ఇప్పటికే కుషాయిగూడకు రావడం నిలిచిపోయిందని, నేటి నుంచి కుషాయిగూడ డిపో 3కే సర్వీసులు కూడా నిలిపివేస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఉప్పల్ నుంచి వచ్చే 117 బస్సులను కూడా త్వరలో నిలిపివేసే అవకాశముందని, మరికొన్ని బస్సు సర్వీసులు ఇప్పటికే రద్దు చేసినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.దాదాపు 50 ఏళ్ల చరిత్ర కలిగిన కుషాయిగూడ బస్‌స్టాప్ ఉనికే ప్రమాదంలో పడిందని, బారికేడ్ల కారణంగా స్థానిక వర్తకులు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ట్రాఫిక్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి బస్సుల రాకపోకలకు అడ్డుగా ఉన్న బారికేడ్లను తొలగించి, అన్ని బస్సు సర్వీసులను యథావిధిగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

# శాలిని పాండే స్టైలిష్ లుక్

సహజమైన నటన, ఆకట్టుకునే అభినయం, అందం, ఫ్యాషన్ సెన్స్‌తో సినీ ప్రేక్షకులను అలరిస్తున్న కథానాయిక శాలిని పాండే తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. 2017లో విడుదలైన సంచలన చిత్రం అర్జున్ రెడ్డితో హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, తొలి సినిమాతోనే యువతలో విపరీతమైన క్రేజ్‌ను సొంతం చేసుకుంది. ఆ చిత్ర విజయం తర్వాత తెలుగు చిత్రసీమలోనే కాకుండా హిందీ, తమిళ భాషల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ బహుభాషా కథానాయికగా తన స్థానాన్ని బలపరుచుకుంది. పాత్రల ఎంపికలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తూ ఒక్కో చిత్రంలో ఒక్కో విభిన్న కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది.తెలుగు తర్వాత బాలీవుడ్‌లో అడుగు పెట్టిన శాలిని పాండే, రణవీర్ సింగ్ సరసన జయేశ్‌భాయ్ జోర్దార్ చిత్రంలో నటించి హిందీ ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. అనంతరం చారిత్రక నేపథ్యంతో తెరకెక్కిన మహారాజ్ చిత్రంలో జునైద్ ఖాన్‌తో కలిసి నటించి తన నటనలోని పరిపక్వతను మరోసారి చాటుకుంది. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను సహజంగా ఆవిష్కరించగల నటిగా ఆమెకు మంచి గుర్తింపు లభించింది. కమర్షియల్ చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యం ఉన్న సినిమాలను ఎంచుకోవడం ద్వారా తన కెరీర్‌ను విభిన్న దిశలో తీసుకెళ్తోంది. సినిమాలతో పాటు డిజిటల్ వేదికల్లోనూ శాలిని తన ప్రతిభను చాటుతోంది. డబ్బా కార్టెల్ వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించిన ఆమె, ఓటీటీ ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన అందుకుంది. అలాగే ధనుష్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం ఇడ్లీ కడైలో నటిస్తూ తమిళ సినీ పరిశ్రమలోనూ తన స్థానాన్ని మరింత బలపరుచుకుంది. ఇక రాహు కేతు చిత్రంలో వినోదాత్మక పాత్రలో కనిపించనున్న ఆమె, మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. భాషలతో సంబంధం లేకుండా మంచి కథలు, విభిన్నమైన పాత్రలకే ప్రాధాన్యం ఇస్తూ తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది.

సినిమాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలోనూ శాలిని పాండే తనదైన ముద్ర వేస్తోంది. సంప్రదాయ దుస్తుల నుంచి ఆధునిక దుస్తుల వరకు ఏ తరహా వేషధారణలోనైనా ఆమె ఎంతో హుందాగా కనిపిస్తుందని అభిమానులు అభిప్రాయపడుతుంటారు. సోషల్ మీడియాలోనూ ఆమె పంచుకునే ఫొటోలు, ఫ్యాషన్ స్టేట్‌మెంట్లు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుంటాయి. ప్రతి ఫోటోషూట్‌లో కొత్తదనాన్ని చూపిస్తూ స్టైల్ ఐకాన్‌గా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. తాజాగా నిర్వహించిన ఫోటోషూట్‌లో శాలిని పాండే మరోసారి తన గ్లామర్‌తో పాటు హుందాతనాన్ని చాటుకుంది. గాఢమైన ఎరుపు రంగు హైనెక్ డ్రెస్‌లో ఆమె ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. సింపుల్ లోపోనీటెయిల్ హెయిర్ స్టైల్, సహజత్వాన్ని ప్రతిబింబించే మేకప్, బంగారు రంగు జ్యామితీయ ఆకారపు చెవిపోగులు ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. ఎరుపు రంగు నేపథ్యానికి అనుగుణంగా ఆమె ఇచ్చిన ఆత్మవిశ్వాసభరితమైన హావభావాలు, గంభీరమైన చూపులు ఫోటోషూట్‌ను మరింత ప్రత్యేకంగా నిలిపాయి.

ఈ ఫోటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె అందం, స్టైల్, హుందాతనంపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. నటిగా వరుస అవకాశాలతో బిజీగా ఉన్న శాలిని పాండే, మరోవైపు తన ఫ్యాషన్ సెన్స్‌తోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతూ సినీ ప్రేక్షకులతో పాటు ఫ్యాషన్ ప్రియులను కూడా ఆకట్టుకుంటోంది.





# సెప్టెంబర్ 11న మహేంద్రగిరి వారాహి

హీరో సుమంత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న డివోషనల్ థ్రిల్లర్ మహేంద్రగిరి వారాహి చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. వివిధ డిజిటల్ వేదికల్లో టీజర్ ఒక కోటి వ్యూస్‌ను దాటడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది.టీజర్‌కు లభించిన స్పందనతో సినిమా నాన్ థియేట్రికల్ హక్కులకు భారీ స్థాయిలో డిమాండ్ ఏర్పడిందని నిర్మాత మధు తెలిపారు. విడుదలకు ముందే మంచి ఒప్పందాలతో నాన్ థియేట్రికల్ బిజినెస్ పూర్తయిందని వెల్లడించారు. కథ, విజువల్ ప్రెజెంటేషన్, సాంకేతిక విలువలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయనే నమ్మకంతో అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన వస్తోందన్నారు.ఈ చిత్రంలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ప్రత్యేక అంశం కూడా ఉండబోతోందని నిర్మాత వెల్లడించారు. ఓ ప్రముఖ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాల పాటు కొనసాగే అత్యంత శక్తివంతమైన ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని చెప్పారు. ఆ స్టార్ హీరో ఎవరు అనే విషయాన్ని ప్రస్తుతం గోప్యంగా ఉంచిన చిత్రబృందం, రాబోయే ట్రైలర్‌లో ఆ సర్‌ప్రైజ్‌ను అధికారికంగా ప్రకటించనున్నట్లు తెలిపింది. దీంతో ఆ ప్రత్యేక పాత్రపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.ఈ చిత్రంలో సీనియర్ నటి ఐశ్వర్య రాజేష్ వారాహి అమ్మవారి పాత్రలో కనిపించనుండటం మరో విశేషం. ఆమె పాత్ర కథకు కీలక మలుపు తిప్పేలా ఉంటుందని చిత్ర యూనిట్ పేర్కొంటోంది. ఆధ్యాత్మిక అంశాలను థ్రిల్లింగ్ కథనంతో మేళవిస్తూ రూపొందించిన ఈ చిత్రంలో విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయని సమాచారం.సినిమా ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు చిత్రబృందం ప్రయత్నాలు చేస్తోంది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. సినిమా ప్రయాణం గురించి హీరో సుమంత్ మాట్లాడుతూ, ఈ కథకు రెండున్నరేళ్ల క్రితమే శ్రీకారం చుట్టామని చెప్పారు. కథకు తగిన స్థాయిలో విజువల్ గ్రాండియర్‌ను అందించాలంటే సరైన నిర్మాత, తగిన బడ్జెట్ అవసరమైందని, అందుకే కొంతకాలం వేచి చూడాల్సి వచ్చిందన్నారు. టీజర్‌లో చూపించినది సినిమాలోని ఒక చిన్న భాగమేనని, అసలు కథ థియేటర్లలో ప్రేక్షకులను మరింత ఆశ్చర్యానికి గురిచేస్తుందని తెలిపారు.ముఖ్యంగా క్లైమాక్స్‌తో పాటు సినిమా మొత్తం ఉత్కంఠభరితమైన మలుపులతో సాగుతుందని, ప్రతి సన్నివేశం ప్రేక్షకులను సీటు అంచున కూర్చోబెట్టేలా రూపొందించామని సుమంత్ ధీమా వ్యక్తం చేశారు. భక్తి, మిస్టరీ, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన మహేంద్రగిరి వారాహి చిత్రం ఈ ఏడాది అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందని చిత్రబృందం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

# భుజం గాయంతో షూటింగ్‌లకు విరామం


యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు ఆందోళన కలిగించే వార్త వెలువడింది. సోమవారం సాయంత్రం ఆయనకు అనుకోకుండా భుజానికి గాయం కావడంతో వెంటనే వైద్యులను సంప్రదించారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ బృందం అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించింది. గాయం అనంతరం వైద్య నిపుణులు ఆయనకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.

డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఎన్టీఆర్‌ను పరీక్షించి, పూర్తిగా కోలుకోవడానికి కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు సంపూర్ణ విశ్రాంతి అవసరమని సూచించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని వెల్లడించారు.


అయితే అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్టీఆర్ కార్యాలయం స్పష్టం చేసింది. గాయం తీవ్రంగా లేదని, వైద్యుల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకుంటే త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని పేర్కొంది. ఎన్టీఆర్ ఆరోగ్యానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు విడుదల చేస్తామని కూడా తెలిపింది.

ప్రస్తుతం ఎన్టీఆర్ పలు భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. వైద్యుల సూచనల మేరకు కొద్ది వారాల పాటు ఆయన షూటింగ్‌లకు విరామం ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఆయా చిత్రాల చిత్రీకరణ షెడ్యూళ్లలో స్వల్ప మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే దీనిపై చిత్ర నిర్మాణ సంస్థలు ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు, సహనటులు సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షిస్తున్నారు. "గెట్ వెల్ సూన్ ఎన్టీఆర్" అనే హ్యాష్‌ట్యాగ్‌తో వేలాది మంది అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు చేస్తున్నారు. విశ్రాంతి అనంతరం ఆయన మళ్లీ పూర్తి ఉత్సాహంతో షూటింగ్‌లలో పాల్గొంటారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఆదిపురుష్‌పై మనోజ్ క్షమాపణ



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఆదిపురుష్ సినిమా విడుదల సమయంలో దేశవ్యాప్తంగా తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైన విషయం తెలిసిందే. ముఖ్యంగా రామాయణాన్ని తెరపై ఆవిష్కరించిన విధానం, పాత్రల రూపకల్పన, సంభాషణలు, విజువల్ ఎఫెక్ట్స్‌పై ప్రేక్షకులతో పాటు పలు హిందూ సంఘాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ చిత్రానికి సంభాషణలు అందించిన రచయిత మనోజ్ ముంతశీర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు మరోసారి ఈ సినిమాను వార్తల్లో నిలిపాయి.2023లో విడుదలైన ఈ చిత్రంలో ప్రభాస్ శ్రీరాముడి పాత్రలో, కృతి సనన్ సీతగా, సైఫ్ అలీ ఖాన్ రావణుడిగా నటించారు. భారీ అంచనాలు, భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించినప్పటికీ, కథనం, పాత్రల రూపకల్పన, సంభాషణలు, విజువల్ ప్రెజెంటేషన్‌పై తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. వివాదాలు మరింత ముదరడంతో చిత్రబృందం విడుదల అనంతరం కొన్ని డైలాగ్‌లను మార్చాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. సినిమా విడుదల సమయంలో వచ్చిన విమర్శలను గతంలో సమర్థించిన మనోజ్ ముంతశీర్, ఇప్పుడు తన వైఖరిని పూర్తిగా మార్చుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, "ఆదిపురుష్ నా జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు. సినిమా విడుదలైన తర్వాత దానిని సమర్థించడం అంతకంటే పెద్ద తప్పు" అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో తీసుకున్న నిర్ణయాలపై ఇప్పుడు తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నానని తెలిపారు.ఆ సినిమా చుట్టూ జరిగిన పరిణామాలు తనను వ్యక్తిగతంగా ఎంతో బాధించాయని మనోజ్ చెప్పారు. సినిమా కారణంగా ఎవరి మతపరమైన లేదా ఆధ్యాత్మిక మనోభావాలు దెబ్బతిని ఉంటే, దేశ ప్రజలందరికీ హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నానని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలు, భావోద్వేగాలను గౌరవించడం ప్రతి సినీ సృష్టికర్త బాధ్యత అని, ఆ విషయంలో తాను చేసిన పొరపాటుకు పూర్తి బాధ్యత వహిస్తున్నానని అన్నారు.మనోజ్ ముంతశీర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. కొందరు ఆయన నిజాయితీగా తన తప్పును అంగీకరించారని అభినందిస్తుండగా, మరికొందరు సినిమా విడుదలైన రెండేళ్ల తర్వాత క్షమాపణలు చెప్పడం ఆలస్యమైందని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా, ఆయన వ్యాఖ్యలు మరోసారి ఆదిపురుష్ సినిమాపై జరిగిన వివాదాలను చర్చనీయాంశంగా మార్చాయి.

# హీరోయిన్ లేకుండానే బన్నీ సినిమా?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న తాత్కాలికంగా 'AA23'గా పిలుస్తున్న ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. పుష్ప సిరీస్ విజయాల తర్వాత అల్లు అర్జున్ నటిస్తున్న ప్రతీ చిత్రం జాతీయ స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా గురించి తాజాగా వినిపిస్తున్న వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.తాజా ప్రచారం ప్రకారం ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర ఉండదని, అలాగే ప్రత్యేకమైన రొమాంటిక్ ట్రాక్‌కు కూడా చోటు ఉండదని సమాచారం. పూర్తిగా యాక్షన్, ఎమోషన్, థ్రిల్లింగ్ అంశాల చుట్టూనే కథను రూపొందిస్తున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథనానికి అవసరం లేని వాణిజ్య అంశాలను జోడించకుండా, కంటెంట్‌కే ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందించే ఆలోచనలో లోకేష్ కనగరాజ్ ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ ప్రచారం నిజమైతే అల్లు అర్జున్ కెరీర్‌లో ఇది అత్యంత విభిన్నమైన చిత్రంగా నిలిచే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్ హీరోల సినిమాల్లో తప్పనిసరిగా హీరోయిన్, ప్రేమకథ, పాటలు ఉండాలనే సాంప్రదాయ ఫార్ములాకు భిన్నంగా ఈ చిత్రం రూపొందే అవకాశం ఉందని చెబుతున్నారు. దీంతో అభిమానుల్లోనూ ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి నెలకొంది.గతంలో లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఖైదీ, విక్రమ్ వంటి చిత్రాల్లో కూడా సాంప్రదాయ రొమాంటిక్ ట్రాక్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకుండా కథను పూర్తిగా యాక్షన్, భావోద్వేగాల ఆధారంగా నడిపించారు. ఆ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాలు సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. ఇప్పుడు అదే తరహా శైలిని అల్లు అర్జున్ చిత్రంలోనూ కొనసాగించే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది.పుష్ప చిత్రాలతో దేశవ్యాప్తంగా విపరీతమైన గుర్తింపు సంపాదించుకున్న అల్లు అర్జున్ ప్రస్తుతం తన తదుపరి చిత్రాల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రంలో నటిస్తూనే, లోకేష్ కనగరాజ్‌తో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఈ రెండు చిత్రాలపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.అయితే హీరోయిన్ లేకపోవడం, రొమాంటిక్ ట్రాక్ ఉండదనే వార్తలపై చిత్రబృందం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అధికారిక సమాచారం వచ్చే వరకు ఈ వార్తలను కేవలం ప్రచారంగానే చూడాల్సి ఉంటుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ ఈ ప్రచారం కారణంగా 'AA23'పై మరింత ఆసక్తి నెలకొనడం విశేషం.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com